

హైదరాబాద్ వార్త



## నేడు సచివాలయం ప్రారంభం

**ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు**

హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : తెలంగాణ నూతన సచివాలయం సాగర తీరాన ఠీవీగా నిలిచింది. సంప్రదాయ, ఆధునిక సొకార్యాల కలబోతతో రూపుదిద్దుకున్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ సచివాలయాన్ని ఆదివారం సిఎం కెసిఆర్ ప్రారంభించనున్నారు. దీంతో ఆదివారం ఉదయం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు సచివాలయం పరిసరాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉండనున్నాయి. ఈ ఆంక్షల వల్ల ట్యాంక్‌బండ్ వైపు వచ్చే వాహనాలను దారిమళ్లించారు. పంజాగుట్ట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనాలు నెక్లెస్ రోడ్డు వైపు మళ్లించినట్లు అధికారులు తెలిపారు. అలాగే చింతల్‌బస్తీ నుంచి వచ్చే వాహనాలు నెక్లెస్ రోడ్డు వైపు అనుమతి నిరాకరించారు. ఇక్బాల్ మినార్ నుంచి వచ్చే వాహనాలకు తెలుగు తల్లి జంక్షన్ వైపు మళ్లించారు.

**ట్రాఫిక్ మళ్లింపులు ఇలా..**

● ఆఫ్జల్‌గంజ్ నుంచి సికింద్రాబాద్‌కు ట్యాంక్‌బండ్‌పై నుంచి వెళ్లే ఆర్టీసి బస్సులు తెలుగు తల్లి ఫ్లైఓవర్ నుంచి కట్టమైసమ్మ ఆలయం లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్, కవాడిగూడ వైపునకు వెళ్లాలి ● ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ వైపు నుంచి నెక్లెస్ రోటరీవైపు అనుమతి లేదు. ఈ వాహనాలను వీవీ విగ్రహం చౌరస్తా నుంచి సాదన్ కాలేజీ, నిరాంకరి వైపు మళ్లిస్తారు ● నిరాంకరి చింతలబస్తీ వైపు నుంచి నెక్లెస్ రోటరీ వైపు వెళ్లే వాహనాలకు ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్లేందుకు వీలు ఉండదు. ● లిబర్టీ వైపు నుంచి తెలుగు తల్లి, అంబేద్కర్ విగ్రహం, తెలుగు తల్లి జంక్షన్ వైపు అనుమతి లేదు. ఈ వాహనాలు నేరుగా ఫ్లైఓవర్ మీదకు వెళ్లి అక్కడి నుంచి లోయర్ ట్యాంక్‌బండ్ వెళ్లాలి ● ట్యాంక్‌బండ్, తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వైపు వాహనాలకు అనుమతి లేదు. ఈ వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్ జంక్షన్ వైపు మళ్లిస్తారు ● బిఆర్‌కె భవన్ వైపు నుంచి ఎన్టీఆర్ మార్గ్‌కు వెళ్లే వాహనాలను తెలుగుతల్లి జంక్షన్ నుంచి ఇక్బాల్ మినార్ జంక్షన్ వైపు మళ్లిస్తారు ● బడా గణేశ్ నుంచి నెక్లెస్ రోటరీ వైపు వచ్చే వాహనాలను బడా గణేశ్ నుంచి రాజ్‌దూత్ లైన్‌కు మళ్లిస్తారు.

**ఆర్టీసి బస్సులు మళ్లింపులు ఇలా..**

● అఫ్జల్‌గంజ్ నుంచి ట్యాంక్‌బండ్ మీదుగా సికింద్రాబాద్ వైపు వెళ్లే ఆర్టీసి బస్సులు, రవీంద్రభారతి, తెలుగు తల్లి ఫ్లై ఓవర్, కట్ట మైసమ్మ టెంపుల్, లోయర్ ట్యాంక్‌బండ్, డిబిఆర్ మిల్స్, కవాడిగూడ మీదుగా సికింద్రాబాద్ చేరుకోవాలి ● వివి విగ్రహం జంక్షన్, ఓల్డ్ సైఫాబాద్ పిఎస్ జంక్షన్, రవీంద్రభారతి జంక్షన్, మింట్ కంపౌండ్ రోడ్డు, తెలుగు తల్లి జంక్షన్, నెక్లెస్ రోటరీ, నల్లగుట్ట జంక్షన్, కట్ట మైసమ్మ టెంపుల్, ట్యాంక్‌బండ్, లిబర్టీ జంక్షన్ల వైపు వాహనాలకు అనుమతించరు.

**నేడు లుంబినిపార్కు, ఎన్టీఆర్ గార్డెన్ బంద్..** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం సచివాలయం పరిసరాల్లోని పార్కులు, వినోద కేంద్రాలను మూసివేయనున్నారు. ఆదివారం మధ్యాహ్నం సచివాలయం ప్రారంభోత్సవం చేయనున్న సందర్భంగా పరిసరాల్లో రద్దీని దృష్టిలో పెట్టుకొని సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆదివారం లుంబిని పార్కు, ఎన్టీఆర్ గార్డెన్, ఎన్టీఆరన ఘాట్, లేజర్ షోలను మూసి వేస్తున్నట్లు హెచ్ఎండిఎ ప్రకటించింది.

## పెద్ద పులిని దత్తత తీసుకున్న వాసవీ ఫౌండేషన్



చార్మినార్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కుకు చెందిన ఓ పెద్ద పులిని హైదరాబాద్ వాసవీ ఫౌండేషన్ ఒక సంవత్సరం పాటు దత్తతకు తీసుకుంది. శనివారం జూపార్కును వాసవీ ఫౌండేన్ ప్రతినిధులు సందర్శించారు. హైదరాబాద్ వాసవీ ఫౌండేషన్ చైర్మన్ ఎర్రం విజయ్ కుమార్ తరుపున డైరెక్టర్ దివ్య ఎర్రం జూపార్కు క్యూరేటర్ ప్రశాంత్ బాజీరావుకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం ఖరీదు.. నిండు ప్రాణం

## బాలికను మింగేసిన నాలా!

## బట్టబయలైన అధికారుల నిర్లక్ష్యం

**పాల ప్యాకెట్ కోసం వెళ్లిన 11ఏళ్ల బాలిక నాలాలో పడి మృత్యువాత**

**నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో ఇద్దరు అధికారుల సస్పెన్షన్**

**సమగ్ర నివేదిక ఇవ్వాలంటూ ఈఈ ని ఆదేశించిన జిహెచ్ఎంసి కమిషనర్**

**బాలిక కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటాం : మంత్రి తలసాని**



నాలాలో పడి ప్రాణాలు కోల్పోయిన మౌనిక (ఫైల్‌ఫోటో)

అనుభవం కలిగిన యంత్రాంగం, కోట్లాది రూపాయల నిధుల మంజూరు. నిరంతరం మంత్రి పర్యవేక్షణ, నియోజకవర్గంలో పర్యటనలు, స్థానిక ప్రజా ప్రతినిధుల డివిజన్ల వారీ పర్యటనలు ఇలాంటి పటిష్టమైన యంత్రాంగం తమదిగా చెప్పుకుంటుంది ప్రభుత్వం. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతున్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటుంది. ప్రతి ఏటా వర్షాలు కురిసిన సమయంలో నాలాల పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు నిత్యం సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. కొన్ని ఘటనలలో ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. నగరంలోని నాలాలు చిన్న పాటి వర్షానికే ఉగ్రరూపంతో ప్రవహిస్తూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి.



మృతిచెందిన బాలిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి తలసాని

హైదరాబాద్, బేగంపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : నగరంలో రెండు గంటల పాటు కురిసిన వర్షానికి నగరం చిగురుటాకులా వణికిపోతుంది. అత్యాధునిక సాంకేతిక నైపుణ్యాన్ని కలిగి ఉన్న ఇలాంటి తరుణంలో నగరంలో వర్షాలు కురిసిన సమయంలో గోడలు కూలడం, నాలాలు పొంగడం, మ్యాన్‌హోల్స్ నోళ్లు తెరచి ప్రజల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు తిరిగి ఇల్లు చేరేవరకు ఎప్పుడు ఏం జరుగుతుందో నని బిక్కు బిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి. ఇలా ప్రతి ఏటా నగరంలోని ఏదో ఒక చోట ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు అన్న విమర్శలున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటం విపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు వారి కి అస్త్రాలు గా మారుతున్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో జంట నగరాల పరిధిలో ఏదో ఒక చోట నాలాల్లో పడి ప్రజలు కొట్టుకుపోవడం, వర్షం నీరు పోయేందుకు మ్యాన్‌హోల్స్ మూతలు తెరచి ఉంచి వాటి వద్ద ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో బయటకు వచ్చిన వారు ప్రమాదవశాత్తు అందులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా ఇలాంటి ఘటన శనివారం ఉదయం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని కళాసిగూడా లో చోటు చేసుకుంది. పాల ప్యాకెట్లు కోసం ఇంటి నుంచి బయటకు వచ్చిన మౌనిక(11) మ్యాన్‌హోల్ నాలాపైన ఉన్న గుంతలో ప్రమాదవశాత్తు కాలువేయడం, క్షణాల్లో నాలాలోకి జారిపోవడం ఈ ఘటనలో బాలిక ప్రాణం కోల్పోవడం జరిగింది. కళాసీగూడలో నివాసం ఉండే శ్రీనివాస్ రేణుక దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. వారిలో కార్తీక్ (15), ప్రత్యేక అర్హతలు కలిగిన యువకుడు కాగా మౌనిక (11), స్థానికంగా ఉన్న పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుంది. శనివారం ఉదయం తనకు ఆకలిగా ఉందంటూ బాలిక ఆమె తల్లి రేణుక వద్దకు వెళ్లి చెప్పింది. ఈ సమయంలో సమీపంలోని కిరాణా షాపుకు వెళ్లి ఒక పాలప్యాకెట్, బిస్కెట్ ప్యాకెట్ తెచ్చు కోవాలంటూ బాలికకు ఆమె తల్లి చెప్పింది. ఈ క్రమంలో ఇంటి నుంచి సోదరుడు కార్తీక్‌తో కల్సి బయటకు వచ్చిన మౌనిక నడుచుకుంటూ వెళుతుండగా కార్తీక్ కింద పడిపోయాడు. అన్నను కాపాడిన చెల్లెలు మౌనిక (11) నాలా పై నున్న గుంతలో కాలువేసింది. ఈ సమయంలో ఆమె నీటి ప్రవాహానికి నేరుగా నాలాలోకి జారిపోయింది. బాలిక కళాసీగూడా వద్ద నాలాలో పడి సుమారు 500 మీటర్ల దూరం పార్కులైన్ వరకు కొట్టుకుపోయింది. అక్కడ ఒక మ్యాన్‌హోల్ తట్టుకుని ఆగిపోయింది. చెల్లెలు నాలాలో పడిపోయిన విషయాన్ని ఆమె సోదరుడు ఇంటికి వెళ్లి తల్లి దండ్రులకు చెప్పాడు. వారు వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని గాలించి సమాచారాన్ని డీఆర్ఎఫ్‌కు అందించారు. రంగంలోకి దిగిన డీఆర్ఎఫ్ సిబ్బంది పార్కులైన్ మ్యాన్‌హోల్ వద్ద నాలాలో గుర్తించారు. ఆమెను బయటకు లాగి పరీక్షించగా అప్పటికే బాలిక మృతి చెందినట్లు గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు నమోదు చేసుకున్న పోలీసులు పోస్ట్‌మార్టం నిమిత్తం బాలిక మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

**బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు**

కళాసీగూడా నాలాలో బాలిక మౌనిక మృతి చెందిన ఘటనపై మహంకాళి పోలీసులు కేసు నమోదు చేసారు. బాలిక తండ్రి పొగాకు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసారు. వివరాలిలా ఉన్నాయి. తమ కుమార్తె మౌనిక (11) బూరుగు విశ్వనాధం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐదవ తరగతి చదువుతుందన్నారు. శనివారం ఉదయం తన కుమారుడు కార్తీక్‌తో కలిసి పాలప్యాకెట్ తెచ్చేందుకు బయటకు వెళ్లిన సమయంలో కళాసీగూడా పాఠశాల ఎదురుగా ఉన్న నాలాలో పడిపోయిందని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసుకున్న ఎస్సై పి.రాంబాబు బాలిక మృతదేహానికి గాంధీలో పోస్ట్‌మార్టం నిర్వహింపజేసారు. 174సీఆర్‌పీసీ సెక్షన్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**బాలిక కుటుంబానికి 25లక్షల రూపాయల నష్ట పరిహారం అందించాలి : రాంగోపాల్‌పేట కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్**

అధికారుల నిర్లక్ష్యం కారణంగా కళాసీగూడా నాలాలో పడి ప్రాణాలు కోల్పోయిన బాలిక మౌనిక(11) కుటుంబానికి ప్రభుత్వం 25లక్షల రూపాయల నష్ట పరిహారాన్ని అందించాలని, ఆ కుటుం బానికి అన్ని విధాల అండగా నిలవాలని రాంగోపాల్‌పేట డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్ చీరె సుచిత్రా శ్రీకాంత్ డిమాండ్ చేసారు. సంఘటన గురించి తెల్సిన వెంటనే తాము ఆప్రాంతానికి చేరుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసామన్నారు. ఇదే విషయాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసికెళ్లామన్నారు. బాలికను గాంధీ ఆస్పత్రికి తరలించేటట్లు పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

**నిర్లక్ష్యం వహించిన అధికారుల సస్పెన్షన్..** సికింద్రాబాద్ కళాసిగూడ వద్ద శనివారం ఉదయం నాలాలో పడి మౌనిక అనే బాలిక మృతి కేసులో హైదరాబాద్ మహానగర పాలక సంస్థ చర్యలు చేపట్టింది. నాలా ఘటనలో నిర్లక్ష్యం వహించిన ఇద్దరు అధికారులపై సస్పెన్షన్ వేటు వేసింది. ఏఈ తిరుమలయ్య, వర్క్ ఇన్స్‌పెక్టర్ బిఎం హరికృష్ణలను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మొత్తం ఘటనపై 10 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఈఈ ఇందిరాబాయికి జిహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు.

**చిన్నారి బాలిక మౌనిక మృతి దురదృష్టకరం : మంత్రి తలసాని**

కళాసిగూడా నాలాలో పడి మౌనిక అనే బాలిక మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం సాయంత్రం సంఘటనా స్థలానికి వెళ్లిన మంత్రి ఘటన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలిక ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలిక కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం తరుపున 5లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించనున్నట్లు చెప్పారు. ఘటనపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసారు. బాలిక మరణంతో ఆ కుటుంబం తీవ్ర దుఃఖంలో ఉంటే రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై లేని పోని ఆరోపణలు చేయడం దుర్మార్గమని అన్నారు. కేంద్రమంత్రిగా నాలుగు సంవత్సరాలలో ఒక్క రూపాయి తీసుకొచ్చారా అని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. చేతనైతే కేంద్రమంత్రి బాధిత కుటుంబానికి చేతనైనంత సహాయం చేయాలని హితవు పలికారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం లేదని పేర్కొనడం బాధ్యతారాహిత్యం అన్నారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఆదేశాల మేరకు మున్సిపల్ శాఖా మంత్రి ఆధ్వర్యంలో వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కోసం ఎస్ఎన్‌డిపి కార్యక్రమం కింద నగరంలో పలు నాలాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. మంత్రి వెంట డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణా గౌడ్, మల్లికార్జునగౌడ్, జోనల్ కమీషనర్ శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

## మే 5 నుంచి 13 వరకు చిక్కడపల్లి శ్రీవారి బ్రహ్మోత్సవాలు




చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 5వ తేదీనుంచి 13వ తేదీ వరకు జరుగుతాయని ఆలయం వ్యవస్థాపక వంశీయులు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ కె.రామాంజనేయులు వివరించారు. 5న సాయంత్రం విష్వక్సేన పూజ, రక్షాబంధనము, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ట, రాత్రి 8 గంటలకు మహానివేదన, మంత్రపుష్పం, 6న ఉదయం పతాధివాసము, హవనము, బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచకంగా ధ్వజారోహణము ఉంటుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు భేరిపూజ, దేవతాహ్వానము, హవనము, బలిహరణము, రాత్రి శేషవాహనసేవ ఉంటుంది. 7న పల్లకీసేవ, రాత్రి హంసవాహనసేవ, 8న ఉదయం పదిన్నరకు పల్లకీసేవ, రాత్రి గజవాహనసేవ, 9న పల్లకీసేవ అనంతరం స్వామివారికి ఎదురుకోళ్లు అనంతరం కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 10న పల్లకీసేవ, గరుఢవాహన వాహన సేవ, 11న రథప్రతిష్ట, స్వామివారి శృంగార రథోత్సవం, 12న ఉదయం పూర్ణాహుతి, చక్రతీర్థము, ద్వాదశారాధన, శ్రీ పుష్పయాగం, దేవతోద్వాసన ఉంటుంది. 13న ఘటాభిషేక కార్యక్రమాన్ని 81 కలశాలతో జరుగుతుంది. ఈ సందర్భంగా స్వామివారి వెండిపూత ఘటాభిషేక అష్టలక్ష్మి కలశాలను ఇవ్వడం జరుగుతుంది. అదే రోజు రాత్రి స్వామివారి శృంగార డోలోత్సవం అనంతరం వేదపండితులకు సన్మాన కార్యక్రమం ఉంటుంది. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిరోజు లలిత సహస్ర, విష్ణుసహస్రనామ పారాయణాలుంటాయి.

## న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

**ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్**




న్యాయవాదుల ధర్నాలో మాట్లాడుతున్న ఐలూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు విద్యాసాగర్

ధర్నాచౌక్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: న్యాయవాదుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎల్‌యూ (ఐలూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ ధర్నానుద్దేసించి ఐలూ తెలంగాణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విద్యాసాగర్, కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ హెల్త్ స్కీం ద్వారా చెల్లిస్తున్న భీమా పరిమితి రెండులక్షల నుండి ఐదు లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. 2019 తరువాత న్యాయవాద వృత్తిలోకి వచ్చిన వారందరికీ కూడా హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు. న్యాయవాద వృత్తిలో మహిళలు కూడా అధికంగా ఉన్నారని, హెల్త్ స్కీంలో మహిళలకు మెటర్నిటీ కవరేజితో పాటు ఇతర చికిత్సలను కూడా చేర్చాలని కోరారు. ఇటీవల కాలంలో న్యాయవాదులపై దాడులు పెరిగిపోయాయని, తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయవా దులకు ప్రత్యేక రక్షణ చట్టం ను తీసుకురావాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా న్యాయవాదులందరికీ హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, హెల్త్ స్కీంలో న్యాయవాదుల తల్లి తండ్రులను కూడా చేర్చాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమం కోసం వంద కోట్లరూపాయలు కేటాయించి, దానిమీద వచ్చే వడ్డీతో హెల్త్ స్కీం కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు రఘునాథ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వనజతో పాటు తెలంగాణ న్యాయవాదులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# నీటమునిగిన ఇళ్లు.. కూలిన చెట్లు

**వరదలో కొట్టుకుపోయిన వాహనాలు**

**చెరువులను తలపించిన నగర ప్రధాన రోడ్లు**

**పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం**

**సికింద్రాబాద్ కళాసిగూడలో నాలాలోపడి చిన్నారి మృతి**





ధ్వంసం అయిన ద్విచక్రవాహనాలు



హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: అకాల వర్షాలు హైదరాబాద్‌ను అతలాకుతలం చేస్తున్నాయి. తాజాగా శనివారం ఉదయం కురిసిన వాన.. నగరంలో బీభత్సం సృష్టించింది. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి నగరం తడిసి ముద్దయింది. రోడ్లపై నిలిచిపోయిన వాన నీటితో జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి నీరు చేరడం అక్కడ నివాసం ఉంటున్న వారు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సరుకులు, వంట సామాగ్రి పూర్తిగా తడిసిపోయాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వర్షం తగ్గేవరకు బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే గడిపారు. ఉదయం ఏడుగంటల సమయంలో వర్షం ఆగడంతో విద్యుత్ అధికారులు సరఫరాను పునరుద్ధరించారు. పలుచోట్ల వరదనీటిలో ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. రోడ్లపై భారీగా నీళ్ల చేరడంతో ఇళ్లముందు పార్కుచేసి ఉంచిన వాహనాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రామాంతపూర్ పెద్దచెరువు వద్ద ఓకారు అదుపుతప్పి ఎస్ఎన్‌డిపి నాలాలో పడింది. సాయి చిత్రనగర్ రోడ్డు నీట మునిగింది. ముషీరాబాద్ నియోజకవర్గంలోని రెండు చోట్ల గోడకూలిపోయింది. రాజేంద్రనగర్ లో పలు కూడళ్ల వద్ద నీరు నిలిచి వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పద్మకాలనీలో భారీ వర్షానికి కార్లు నీటమునిగాయి. కంటోన్మెంట్ వార్డు 1పరిధిలోని న్యూసిటీ కాలనీ, వెంకటేశ్వర స్వామి దేవాలయం వీధి జలమయమయ్యాయి. అలాగే మర్రి రాంరెడ్డి కాలనీ, పాత సీతారాంపురం కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. హుస్సేన్‌సాగర్ నాలా ప్రహారి నిర్మాణం కారణంగా వర్షానికి గాంధీ నగర్ డివిజన్ అరుందతీ నగర్ బస్తీలో మోకాలిలోతు నీళ్లు చేరాయి. కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ ఆనీల్లలోంటే బస్తీవాసులను పరామర్శించారు. వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని స్థానికులకు హామీ ఇచ్చారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుర్రం శంకర్ స్థానికంగా పర్యటించి బాధితులకు బియ్యం, టిఫిన్ అందజేశారు. గత 28రోజుల్లో కేవలం హైదరాబాద్ జిల్లాలోనే 49.1మి.మీ వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గతద శాబ్ద కాలంలో ఏప్రిల్ మాసంలో కురిసిన వర్షాలను పరిశీలించగా ఇది మూడవ అత్యంత వర్షపాతంగా నమోదైందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. సాధారణంగా ఏప్రిల్ నెలలో వర్షపాతం సగటున 15.4మిమీ దాకా ఉంటుందని కానీ ఈఏడాది మూడు రెట్లు ఎక్కువగా నమోదైందదన్నారు.

**వరదలో కొట్టుకుపోయిన బైక్‌లు, కార్లు..** నగరంలో కురిసిన వర్షానికి కార్లు బైక్‌లు కొట్టుకుపోయాయి. వరద ఉధృతికి నాలాల్లో బైకులు నీటితోపాటు వెళ్లిపోయాయి. టూవీలర్‌లు కొట్టుకుపోవడంతో యజమానులు వాటివెంట పరిగెత్తారు. వరదల దాటికి కొట్టుకుపోతున్న వాటిని ఆపలేక తంటాలు పడ్డారు. మరోవైపు కొన్ని బైకులు నాలాల్లో పడిపోయాయి. వాటిని గుర్తించేందుకు యజమానులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. చివరకు బండి నెంబర్ల ఆధారంగా గుర్తుపట్టారు. వరద ధాటికి కొట్టుకుపోయిన బైకులను తీసేందుకు జిహెచ్ఎంసి సిబ్బంది నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నా లెక్క చేయకుండా నాలాల్లోకి దిగారు. బైకులకు తాడు కట్టి పైకి తీశారు. అలాగే సికింద్రాబాద్ నల్లకుంట పద్మకాలనీ వీధుల్లో అయితే సునామీ తరహా వరద ప్రవహించడంతో కాలనీ వాసుల్లో భయాందోళనలకు గురి చేసింది. ఈవరదకు బండ్లు ,కార్లు కొట్టుకుపోయాయి. రోడ్లపై పార్కింగ్ చేసిన వాహనాలు అడ్రస్ గల్లంతైంది. పద్మ కాలనీలో నాలా పనులు జరుగుతుండటంతో రోడ్డుపక్కన ఉన్న కరెంట్ స్థంబాలు కూలిపోయాయి.

**భారీవర్షంతో ఉలిక్కిపడ్డ పద్మాకాలనీ ప్రజలు**

**30 ద్విచక్రవాహనాలు ధ్వంసం, పదుల సంఖ్యలో కార్లు ధ్వంసం**

ఎడదెరిపి లేకుండా శనివారం తెల్లవారు జామున మూడు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో అడిక్‌మెట్ డివిజన్ ప్రజలంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఒక ప్రక్క ప్రజలంతా గాఢనిద్రలో ఉండడం వర్షం జోరందుకోవడంతో ప్రజలంతా 2020 సంవత్సరం ఆగస్టు నెలలో సంభవించిన ఉపద్రవం తిరిగి రానుందా అని భయాందోళనలకు గురయ్యారు. ఉదయం వేళల్లో చేసుకోవాల్సిన కార్యక్రమాలన్నీ దాదాపు మూడు గంటల పాటు జరగకపోవడం, నిత్యావసర వస్తూవులు, పాల కోసం వెళ్లాల్సిన వారు కూడా భారీ వర్షంతో బయటకు రాకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు గంటల వ్యవధిలోనే ఈ ప్రాంతంలో వర్షబీభత్సం విధ్వంసం సృష్టించింది. పద్మా కాలనీలో నాలా పైకప్పు పనులు నత్తనడక నడుస్తున్న కారణంగా ఈ విధంగా ప్రమాదం సంభవించిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## నిజాయితీగా బాధ్యతలు నిర్వహించిన అధికారుల సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి : జంపనప్రతాప్



డిప్యూటీ సిఈఓను సన్మానిస్తున్న జంపనప్రతాప్, కంటోన్మెంట్ బోర్డు అధికారులు తదితరులు

కంటోన్మెంట్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త: నీతి,నిజాయితీతో పదవీ బాధ్యతలు నిర్వహించిన అధికారుల సేవలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు డిప్యూటీ సిఈఓ విజయ్‌కుమార్ బాలన్ నాయర్ పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా శనివారం ఆయనకు శాలువ కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ ససందర్భంగా జంపనప్రతాప్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో 3 సంవత్సరాల పాటు డిప్యూటీ సిఈఓగా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, జలమండలి సూపరింటెండెంట్ రాజుకుమార్ పాల్గొన్నారు.

## ప్రజలకు రక్షణ నిలవాల్సిన రిటైనింగ్ వాల్ మరింత నష్టం తెచ్చిపెట్టింది



నీటిలో నడుస్తూ సమస్య అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ వల్ల భారీ వర్షం కురిస్తే ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని, తీవ్ర నష్టం మాత్రం జరిగిందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయ్‌కుమార్ తీవ్ర స్థాయి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తెల్లవారు జామున ఎడదెరిపి లేకుండా కురిసిన భారీ వర్షం కారణంగా దెబ్బతిన్న డివిజన్‌లోని అరుంధతినగర్ తదితర నాలా పరీవాహక ప్రాంతాలను నగర బిజెపి నేత ఎ.వినయ్‌కుమార్‌తో కలిసి కార్పొరేటర్ పర్యటించి పరిస్థితిని అంచనా వేసిఅడిగి తెలుసుకున్నారు. అరుంధతినగర్, సబర్మతినగర్, బాపూజీనగర్ తదితర లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ప్రజలను కాపాడాల్సిన నాలా రిటైనింగ్ వాల్ కాస్తా వారికి మరిన్ని కష్టాలు తెచ్చేలా మారిందని అన్నారు. డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలలో పర్యటిస్తూ ప్రజలను మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు ఎం.ఉమేశ్, అనిత, లక్ష్మణ్‌యాదవ్, అరుణ్‌కుమార్, చిత్రా యాదగిరి, రాజేందర్, గోపి, ఆనంద్‌రావు, ప్రశాంత్, డేవిడ్, సతీష్, స్థానికులు పుష్ప, మీన, రాణి, ఏలియా, పద్మ, శ్రీను, భారతమ్మ తదితరులు ఉన్నారు.

## మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చేయూత

### బీఆర్ఎస్ నాయకులు శ్రీగణేష్



సిక్ విలేజ్‌లో కుట్టు మిషన్లు పంపిణీ చేసిన శ్రీగణేష్

బేగంపేట ఏప్రిల్ 29, ప్రభాతవార్త : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టు మిషన్లు అందజేస్తున్నట్లు బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు శ్రీగణేష్ అన్నారు.సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని సిక్ విలేజ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శ్రీగణేష్ కుట్టు మిషన్లను పంపిణీ చేసారు. రెండు నెలల క్రితం శ్రీగణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారితలో భాగంగా స్వయం ఉపాధి శిక్షణ తరగతులను నిర్వహించడం కోసం సిక్ విలేజ్ లో ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు మాట్లాడుతూ తమను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కుట్టులో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టు మిషన్లను ఉచితంగా అందజేసిన శ్రీగణేష్ కు తామంతా రుణపడి ఉంటామన్నారు.అనంతరం ఆయనను మహిళలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శరత్,గౌతమ్,విక్కి,భాస్కర్‌గౌడ్,రాజేష్, భిక్షపతి, సునీత,తివారీ సంతోషి, సంధ్యసాయి పాల్గొన్నారు.

## కళాశాలలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి సారిక కులకర్ణి

నిజాంపేట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపాలిటీ పరిధి ప్రగతి నగర్ విజ్ఞానజ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనపై మూడు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రాహ్ ఫౌండేషన్ వ్యవస్థాపక ట్రస్టీ డా.సారిక కులకర్ణి మాట్లాడుతూ రాహ్ ఫౌండేషన్ ద్వారా స్త్రీ సాధికారత, నీటి వనరుల అభివృద్ధి, ఆర్థిక పెట్టుబడుల ద్వారా ఉత్పాదకత పెంపు, చెక్‌డ్యాంల నిర్మాణం, చేనేత రంగానికి, వ్యవసాయ రంగానికి పలు మార్గాల ద్వారా అందిస్తున్న చేయూతను వివరించారు. నైపుణ్యాభివృద్ధి, సాంకేతికాభివృద్ధి, పరిశోధన, నవకల్పనల ద్వారా దేశ పురోగతికి విద్యా సంస్థలు పోషించాల్సిన భాద్యత ఎంతో ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. అనంతరం విజేఐఎం చైర్‌పర్సన్ హరిశ్చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల జిజ్ఞాసను పెంచుతాయని, విద్యార్థులు తమ లక్ష్యాలను ఉన్నతంగా ఏర్పరుచుకోవాలని, ఈ సదస్సులో నిపుణుల ప్రసంగాలలో సూచించిన సూచనలు సహాలను పాటించి నేర్చుకున్న విషయాలను ఆచరణలో పెట్టాలన్నారు. ఈ సదస్సులో నిపుణులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాంబక్షబండలో మన్‌కీ బాత్ కార్యక్రమం

చార్మినార్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గం రాంబక్షబండలోని ఇంద్ర సూరికుంజ్‌లో ఈ నెల 30వ తేదీన మన్‌కీ బాత్ కార్యక్రమం జరుగుతుందని సీనియర్ బిజెపి నాయకులు చేతన్ సూరి తెలిపారు.ఇంద్ర సూరి కుంజ్‌లో స్క్రీన్ ఏర్పాటు చేయనున్నామని,ప్రధానమంత్రి నరేంద్రమోదీ 100 ఎపిసోడ్ మన్‌కీ బాత్ కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రసారం జరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీకి చెందిన పలువురు బిజెపి నాయకులు పాల్గొంటున్నారని చేతన్ సూరి తెలిపారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని,అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన తెలియజేశారు.

## మణికొండ శ్రీలక్ష్మీనగర్ కాలనీలో పార్కు పనులు ప్రారంభం



మణికొండలోని శ్రీలక్ష్మీనగర్ కాలనీలో రూ.40 లక్షలతో చేపడుతున్న పార్కు పనులు ప్రారంభిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్‌లు

నార్సింగి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీ 13.వ,వార్డు పరిధిలో ఉన్న శ్రీలక్ష్మీనగర్ కాలనీలో రూ.40.లక్షలతో చేపడుతున్న నూతన పార్కు పనులను చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్, వైస్ చైర్మన్ కొండకళ్ల నరేందర్రడ్డిలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంక్రిట్ జంగల్‌గా మారుతున్న మణికొండలో ప్రజలు సేద తీరేందుకు, ఉల్లాసంగా గడిపేందుకు పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. మనస్సుకు హాతుక్కునేలా పచ్చటి గడ్డి, రంగు రంగుల పూల మొక్కలు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. ప్రతి రోజూ క్రమం తప్పకుండా పార్కుల్లో వాకింగ్, అసనాలు, యోగ, ప్రాణాయామం చేస్తే శారీరక, మానసిక అలసటలన్నీ దూరం అవుతాయని తెలిపారు. మణికొండలో మౌలిక వసతులైన మంచినీరు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, సీసీ రోడ్లు, పార్కులు, స్మశాన వాటికలు వంటి వాటికి పెద్దపీట వేస్తున్నామని వివరించారు. అధికారులు, పాలకవర్గ సభ్యులమంతా కలిసి మణికొండను అభివృద్దిలో నెంబర్ వన్‌గా నిలిపేందుకు కష్టపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఫల్గుణ్ కుమార్, కౌన్సిలర్ శ్వేత రవికాంత్‌రెడ్డి, డిఇ దివ్యజ్యోతి, ఏఇ సాయి మౌనిక, కో ఆప్షన్‌సభ్యులు లక్ష్మి, సిద్దప్ప, అహ్మద్ ఖాన్, నాయకులు ముత్యాలు, కిరణ్ కుమార్, రవికాంత్‌రెడ్డి, లక్ష్మీనగర్ కాలనీ అధ్యక్షులు ముంగి మోహన్‌రెడ్డి, ప్రతినిధులు కొండకళ్ల హార్షవర్ధన్‌రెడ్డి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనుల పరిశీలన



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రగతి కాలనీ నుంచి బాబుల్‌రెడ్డి నగర్ పోచమ్మ దేవాలయం లైన్‌లో నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను శనివారం డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో జలమండలి,సీవరేజ్ బోర్డు అధికారులతో మాట్లాడి కొత్త భూగర్భ డ్రైనేజీ పైప్ లైన్ పనులు త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు టి.సుధాకర్‌రెడ్డి, ఎన్నుశ్రీనివాస్‌రెడ్డి, ఎన్.మురళీ బొమ్మరాజు, నర్సింహ, మురళీ,వంశీ, రమేష్‌రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు డిఇ శంకర్,ఎఇ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, సూపర్‌వైజర్ లోక్‌నాథ్‌తో పాటు బస్తీ వాసులు పాల్గొన్నారు.

## అడిక్‌మెట్‌లో విఎస్ఆర్ పర్యటన

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: భారీ వర్షం కారణంగా అడిక్‌మెట్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో ప్రజలు పడ్డ ఇబ్బందులను స్వయంగా తెలుసుకునేందుకు రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి శనివారం పర్యటించి పరిశీలించారు. భారీ వర్షం కారణంగా దెబ్బతిన్న వాహనాల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి దెబ్బతిన్న విద్యుత్తు పోల్స్, రోడ్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడం వంటి అంశాలను తీసుకెళ్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. విఎస్ఆర్ వెంట బిఆర్ఎస్ నేతలు నేతా శ్రీనివాస్, సిరిగిరి శ్యామ్, కార్తీక్ యాదవ్, సాయియాదవ్, అజ్జు, సాయి తదితరులు పాల్గొన్నారు.

## తమిళనాడు తరహాలో రేషన్‌డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలి

### తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘాల ఐక్యవేదిక





తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో పాల్గొన్న నేతలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో రేషన్ డీలర్లను ప్రభుత్వం గుర్తించి తమిళనాడు తరహాలో గౌరవ వేతనం చెల్లించాలని తెలంగాణ రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ నాయికోటి రాజు, సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు పుస్తె శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రేషన్‌డీలర్లకు రూ.45వేల నుంచి రూ.50వేలు వరకు గౌరవ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రేషన్‌డీర్ల సంక్షేమ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో వారు మాట్లాడారు గోదాముల వద్ద 'వే' బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలని, డీలర్లకు ఇన్స్యూరెన్స్ సౌకర్యాలను కల్పించాలని, మంత్రి కెటిఆర్ ఇచ్చిన హామీ మేరకు త్వరితగతిన రేషన్‌డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రేషన్ డీర్ల ఫెడరేషన్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఐక్యవేదిక వైస్‌చైర్మన్ బత్తుల రమేశ్, కన్వీనర్ రవీందర్ సిద్దిపేట, కోకన్వీనర్ మల్లేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి జానకీరామ్, వల్లాల శ్రీధర్, ప్రసాద్, వీరేశం, సద్గురు ఆనంద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళదాం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం

మూసాపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళదామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు పిలుపునిచ్చారు. శనివారం కూకట్‌పల్లి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్పొరేటర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్ళ కాలంలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు వారికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. దశాబ్దాలుగా కానీ పనులు నేడు తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్, మంత్రి కెటిఆర్‌ల సహకారంతో పూర్తి చేసుకున్నామని అన్నారు. ఇందుకు కళ్ళ ముందు కనబడుతున్న అభివృద్ధే సాక్షమని, దీనినే ప్రధాన ఎజండాగా తీసుకుని ముందుకు వెళ్దామని అన్నారు. నియోజకవర్గంలో అందుతున్న సంక్షేమ పథకాలు, రోడ్లు, డ్రైనేజి, మంచినీరు, ఫ్లైఓవర్లు, పార్కులు, నిరంతర విద్యుత్, కళ్యాణలక్ష్మి, షాదిముబారక్, సిఎం రిలీఫ్‌ఫండ్ వంటి పథకాలు ద్వారా ఎంతోమంది నిరుపేదలు లబ్ది పొందుతున్నారని ఇవన్నీ కూడా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత కార్పోరేటర్లగా తమపై ఉందని అన్నారు.



నూతన అధ్యక్షులకు శుభాకాంక్షలు తెలుపుతున్న భూపతిరెడ్డి

## దుండిగల్, కొంపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నవీన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్

దుండిగల్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులుగా మద్దికుంట నవీన్‌రెడ్డి, కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులుగా భైరి ప్రశాంత్‌గౌడ్ నియమితులైనారు. ఈమేరకు శనివారం నూతన అధ్యక్షులు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి భూపతిరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా భూపతిరెడ్డి వారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. నవీన్‌రెడ్డి, ప్రశాంత్‌గౌడ్‌లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంగ్రెస్‌పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డికి పితృవియోగం



ఎడ్ల నారాయణరెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : అంబర్‌పేట నియోజకవర్గం బిఆర్ఎస్ మాజీ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డికి పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి ఎడ్ల నారాయణరెడ్డి (84) మృతిచెందారు. శనివారం ఉదయం మధుసూదన్‌రెడ్డికి గుండె సంబంధించిన అనారోగ్య సమస్య రావడంతో విద్యానగర్‌లోని ఆంధ్రమహిళా సభ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.నారాయణరెడ్డికి ఇద్దరు కుమారులు ఎడ్ల ప్రభాకర్‌రెడ్డి, ఎడ్ల సుధాకర్‌రెడ్డి, ఒక కూతురు శోభారాణిరెడ్డి ఉన్నారు. నారాయణరెడ్డి భౌతికకాయాన్ని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపి వి.హనుమంతరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, విజయ్‌కుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దిడ్డి రాంబాబు, గరిగంటి శ్రీదేవిరమేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎక్కాల కన్నా, శ్రావణ్‌రెడ్డి, సిఎం కెసిఆర్ సోదరుని అల్లుడు పూర్ణ చందర్‌రావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. ఎడ్ల నారాయణరెడ్డి అంత్యక్రియలు ఆదివారం అంబర్‌పేట హిందూ శ్మశానవాటికలో నిర్వహిస్తారని ఆయన కుటుంబసభ్యులు తెలిపారు.

## అకాల వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కార్పోరేటర్ వెంకటేష్‌గౌడ్



నిల్వ ఉన్న నీటిని దగ్గరుండి సిబ్బందితో తొలగిస్తున్న కార్పోరేటర్ వెంకటేష్‌గౌడ్

మూసాపేట, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : అకస్మాత్తుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 124డివిజన్ కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సూచించారు. శనివారం విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా పలు కాలనీలలో ముంపుకు గురైన ప్రాంతాలను కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ జిహెచ్ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం వర్షం కారణంగా రోడ్ల మీద నిలిచిన వర్షపు నీటిని సిబ్బందితో తొలగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యంగా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, రాజబాబు, జనయ్య, శౌర్య, అధికారులు ఏఈ శ్రావణి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసిలో నర్సింగ్ సేవలు మరువలేనివి : ప్రభాకర్



పదవీ విరమణ సన్మాన సభలో ప్రసంగిస్తున్న ఆర్టీసి కార్మిక నేత ప్రభాకర్ తదితరులు

అడ్డగుట్ట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఆర్టీసి సంస్థలో 37 సంవత్సరాల పాటు నిజాయితీతో విధులు నిర్వహించిన అకౌంటెంట్ సూపరిండెంట్ మాదాస్ నర్సింహులు సేవలు మరువలేనివని తోటి ఉద్యోగులు ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకొని విధులు నిర్వహించాలని మియాపూర్ డిపో -1 మేనేజర్ ఎస్.రామయ్య, ఆర్టీసి యూనియన్ నాయకుడు పాకాల ప్రభాకర్‌లు తెలిపారు. మియాపూర్ డిపోలో అకౌంటెంట్‌గా పనిచేసిన నర్సింహులు శనివారం పదవీ విరమణ చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయనకు పూల మాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు పద్మారావు, వల్లూరి, బాబు, ముత్యాలు, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ప్లేగ్రౌండ్‌లను పరిశీలించిన రామక్రిష్ణ

కంటోన్మెంట్,ఏప్రిల్ 29 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నివాసం ఉంటున్న విద్యార్థులకు ఆదివారం వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ప్రారంభం కానున్న సందర్భంగా శనివారం మట్‌పోర్ట్, బోయిన్‌పల్లి, బొల్లారం, తిరుమలగిరి ప్లేగ్రౌండ్‌లను కంటోన్మెంట్ బోర్డు సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ పర్యటించారు.

## మహిళలు అన్నిరంగాల్లో పోటాపోటీగా ఎదుగుతున్నారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి





శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్‌లు అందజేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్తః మహిళలు కొంతకాలంగా అన్ని రంగాలలో రాణిస్తున్నారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఉద్యోగాలు చేయడంతో పాటు ఎంతో మంది మహిళలు స్వయం ఉపాధికి దారులు వేసుకుంటున్నారని తెలిపారు. మాజీ ప్రధాని దివంగత నేత అటల్‌బిహారి వాజ్‌పేయి ఫౌండేషన్ ద్వారా మేకల కీర్తి హర్ష కిరణ్‌ల ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ పొందిన మహిళలకు సీతాఫల్‌మండిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సర్టిఫికేట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగానే కాకుండా ఇతర రంగాలలో కూడా మహిళలు పురుషులకు తీసిపోకుండా ఎంతో ఎదుగుతున్నారన్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధిని కల్పించుకోవడంతో పాటు వ్యాపార రంగంలో కూడా అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. అర్హులైన వారందనికి బ్యాంకులు రుణాలను మంజూరు చేస్తాయని, ఇందుకోసం దేశ ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రత్యేకంగా స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో మేకల సారంగపాణి, రాచమల్ల కృష్ణమూర్తి, శ్యాంసుందర్ గౌడ్, గౌతం రావు, ఆదం విజయ్‌కుమార్, హరి, భాస్కర్‌గిరి, హనుమంత్ ఇతర నేతలు పాల్గొన్నారు.

## క్యాన్ నెంబర్లు కేటాయించాలి



మణికొండ మున్సిపాలిటీలో క్యాన్ నెంబర్లు కేటాయించి, బిల్లులు వసూలు చేయాలని ఎమ్మెల్యేను కోరుతున్న బిఆర్ఎస్ నాయకులు

నార్సింగి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : మణికొండ మున్సిపాలిటీలోని మంచినీటి కనెక్షన్లకు క్యాన్ నెంబర్లు కేటాయించిన తరువాతనే బిల్లులు వసూలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కోరారు. శనివారం మణికొండ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములు తదితరులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి ప్రజలు మంచినీటి బిల్లులు కట్టేందుకు సిద్దంగా ఉన్నారని, ఇప్పటి నుంచి లెక్కగట్టి డబ్బులు వసూలు చేసేలా జల మండలి అధికారులను ఆదేశించాలని కోరారు. ఇందుకు స్పందించిన ప్రకాశ్‌గౌడ్ వెంటనే జల మండలి ఎండికి ఫోన్‌చేసి ప్రజల సమస్యలు విన్నవించారని, ముందుగా క్యాన్ నెంబర్లు కేటాయించి, ఇప్పటి నుంచి బిల్లులు వసూలు చేయాలని కోరినట్లు తెలిపారు. ఇందుకు జల మండలి అధికారులు సమ్మతించారని, మణికొండ మున్సిపల్ ప్రజల సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామని రామకృష్ణారెడ్డి వివరించారు. ప్రజల ఇబ్బందులను త్వరగా దూరం చేస్తుండడంతోనే ప్రకాశ్‌గౌడ్‌ను వరుసగా మూడుమార్లు స్థానిక ప్రజలు గెలిపించుకున్నారని, ఇప్పుడు నాలుగో సారి కూడా గెలిపించుకుంటామని తెలిపారు.

## ఒయులో అంతర్జాతీయ ఇమ్యూనాలజీ దినోత్సవం



ప్రొఫెసర్‌ను సన్మానిస్తున్న సహచర అధ్యాపకులు

తార్నాక, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: అంతర్జాతీయ ఇమ్యూనాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ ఒయూ ఆద్వర్యంలో ఇమ్యూనాలజీ టాక్స్ టూ పబ్లిక్ హెల్త్ పై సిపిఎంబీ హాల్లో జాతీయ సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. విజయలక్ష్మి వల్లూరి మాట్లాడుతూ ఆరోగ్యంలో రోగనిరోధక శాస్త్రం ఎంతో ముఖ్యమైనదన్నారు. ప్రలల్లో వ్యాధిలో రోగనిరోధక ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రొ.కుమార్వేల్ సమసుందర్ మాట్లాడుతూ క్యాన్సర్ సిగ్నలింగ్‌లో మరింత లోతైన పరిశోధనలు జరుగాలని సూచించారు. అనంతరం ఓ.యూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ మాట్లాడుతూ మానవ జీవితంలో ఇమ్మ్యాయనాలజీ ఎంతో ముఖ్యమైన పాత్ర షోషిస్తుందన్నారు. ప్రొ.మల్లేశం మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు పరిశోధనా వధ్యార్థులకు, సైన్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఇమ్యూనాలజీకి సంబంధించిన వివిధ అంశాపై వచ్చిన ప్రతినిధులతో పాటు పలువురు పాల్గొన్నారు. వివిద రంగాల్లో విశేషంగా కృషి చేసిన డాక్టర్లకు సదస్సు నిర్వాహకులు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొగ్రాం కోఆర్డినేటర్ డా. జి.సుమలత, హెడ్ అండ్ కన్వీనర్ ప్రొ.హెచ్.సురేఖా రాణి, డా. సంధ్యారాణి, ఎ.శ్రీనివాస్, డా. ప్రశాంత్ సింగం, డా.సోమేశ్వరరావు, డా. విజయకుమార్, డా. రామకృష్ణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## కావ్య అనెన్యూ కాలనీలో కార్పొరేటర్ పర్యటన

నిజాంపేట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కావ్య అవెన్యూ కాలనీలో శనివారం కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు కురుస్తున్న వర్షాలకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమస్యతో కరెంటు కోతతో తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నామని, వర్షం పడిన ప్రతిసారి ఇదే సమస్య పునరావృతమవుతోందని కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ విద్యుత్ ఏఈతో చర్చించి ట్రాన్స్‌ఫార్మర్ సమస్యకు శాశ్వత పరిష్కారం అందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రామకృష్ణ,శ్రీకాంత్, నవీన్, భరత్, సునీల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై హత్య కేసులు నమోదు చేయాలి

### టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట నీలిమ



మౌనిక మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట నీలిమ

బేగంపేట ఏప్రిల్ 29,ప్రభాతవార్త : అధికారుల నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలిగొందని, ఇలాంటి ఘటనలు జరిగిన సమయంలో బాధ్యులైన అధికారులపై హత్య కేసులు నమోదు చేయాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట నీలిమా డిమాండ్ చేసారు. శనివారం కళాసీగూడా నాలాలో పడి మృతి చెందిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం మౌనిక ఇంటికి వెళ్లి ఆమె మృతదేహం వద్ద నీలిమ నివాళులు అర్పించారు.ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.ప్రతి ఏటా వర్షాకాలంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టడంలో నిర్లక్ష్య వైఖరి అవలభించడం దారుణమన్నారు.మౌనిక కుటుంబానికి కోటి రూపాయల పరిహారం చెల్లించాలని ఆమె డిమాండ్ చేసారు.కొందరు అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రతి ఏటా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఇలాంటి ఘటనలు జరిగిన తరువాతనైనా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ఆమె కోరారు.

## విద్యార్థులకు నైతిక విలువలు నేర్పడం చాలా అవసరం : వడ్డేపల్లి

బేగంపేట ఏప్రిల్ 29,ప్రభాతవార్త : విద్యార్థులకు చదువులతో పాటు సమాజంలో క్రమశిక్షణగా మెలిగేందుకు నైతిక విలువలు నేర్పడం చాలా అవసరమని బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు.వివేకానంద నగర్‌లో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు ఆధ్యాత్మిక విజ్ఞానం చాలా అవసరమని సూచించారు.అందుకోసం బ్రహ్మకుమారీస్ ఏర్పాటు చేసిన ఈ ఉచిత వేసవి శిక్షణా శిభిరం మంచి వేదిక అన్నారు.ఈ శిభిరంలో శారీరక వ్యాయామాలు,మానసిక వికాస పాఠాలతో పాటు నైతిక విలువలు కూడా బోధించడం అభినందనీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ తరుపున బి.కే.జ్యోతి,బికే అనురాధ,బి.కే.పద్మ,ప్రైవేట్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ ప్రెశిడెంట్ శ్యాం తదితరులు పాల్గొన్నారు.వంశీ రామరాజుకు 'కళా సేవా జీవిత సాఫల్య పురస్కారం' ప్రదానం



మెప్మా అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్ తదితరులు

## మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి : మధుకర్ నాయక్

కంటోన్మెంట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి పథకం కింద వివిధ కోర్సులలో నైపుణ్యం పొంది మరి కొందరికి ఉపాధి కల్పించే విధంగా ఎదగాలని కంటోన్మెంట్ బోర్డు సిఈఓ డి.మధుకర్ నాయక్ తెలిపారు. తెలంగాణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ ఫ్రోగ్రామ్, సోషల్ సెక్యూరిటీ స్కీమ్ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదసస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు విద్యా, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఈఓ విజయ్‌కుమార్ బాలన్ నాయర్, శానిటరీ సూపరింటెండెంట్ ఎం.దేవేందర్, హెల్త్ ఆఫీసర్ అఫ్జల్ మొహిద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హిమాయత్‌నగర్ వీధుల్లో పర్యటించిన బిజెపి నాయకులు

హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: శనివారం ఉదయం హిమాయత్‌నగర్‌లో కురిసిన భారీ వర్షంతో ప్రజలు ఆనేక ఇబ్బందులకు గురైనారు. దీంతో బిజెపి నాయకులు హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు వీధుల్లో పర్యటించారు. స్ట్రీట్ నెంబరు 14లో నడుం లోతు వరకు నీళ్ల వచ్చాయి. స్ట్రీట్ నెంబరు 5 తదితర ప్రాంతాలలో చెట్ల కొమ్మలు విరిగి పోయి నడిరోడ్డున పడ్డాయి. ప్రజల ఇబ్బందులను గమనించిన బిజెపి నాయకుడు జి.రామన్‌గౌడ్ వెంటనే మున్సిపల్ అధకారులకు ఫోన్ చేసి పిలిపించడ జరిగింది. దీంతో సిబ్బంది సమస్యలను పరిష్కారించారు. బిజెపి నాయకులు కొమ్మలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జైస్వాల్, జక్కి, మల్లేష్ పాల్గొన్నారు.

## యువ ఓటర్లతో ఎక్కాల కన్నా సమావేశం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎక్కాల కన్నా తదితరులు

హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త: రానున్న ఎన్నికల్లో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న కాచిగూడ డివిజన్‌లోని పలు డిగ్రీ కాలేజీ విద్యార్థులతో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎక్కాల కన్నా శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమపథకాలను వారికి వివరించారు. ముఖ్యంగా సిఎం కెసిఆర్ నాయత్వంలో రైతుల సంక్షేమం కోసం చేస్తున్న రైతుబంధు,రైతుభీమా, 24గంటల నిరంతర విద్యుత్, వంటి వాటిని గూర్చి యువ ఓటర్లకు తెలియజేశారు. రైతు భాగుపడితే దేశం బాగుంటుందని అన్ని వర్గా ప్రజలకు సేవచేయాలన్న ఉద్దేశ్యంతో సిఎం కెసిఆర్ బిఆర్ఎస్‌ను స్థాపించారన్నారు. ఈసందర్భంగా యువ ఓటర్లు బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని సోషల్‌మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాయకులు మున్నాసింగ్, కిట్టు, అశోక్, సాగర్, శేఖర్, కొండ అంజమ్మ, సునీత, లక్ష్మీ, ప్రియ, మంజు తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు, బీసీ కులగణన, సామాజిక న్యాయ సాధనకై

## 'పూలే అంబేద్కర్ జన జాతర'

చిక్కడపల్లి, ఏప్రిల్ 29ప్రభాతవార్త: రిజర్వేషన్‌లు, బీసీ కులగణన, సామాజిక న్యాయ సాధనకై 'పూలే అంబేద్కర్ జన జాతర' కార్యక్రమం శనివారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సామాజిక సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ అంబేద్కర్‌వాదీ జేబి.రాజు, విశ్రాంత ఐఎఎస్ అదధికారి టి.గోపాలరావు, గౌడ సంఘాల జేఏసీ చైర్మన్ బాలరాజ్‌గౌడ్, కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రామ్‌దాస్ నాయక్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పర్యటన

చిక్కడపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఈదురుగాలులతో భారీ వర్షం కారణంగా ముషీరాబాద్ నియోజకవర్గం లోని పలు ప్రాంతాలన్నీ నీటిలో మునిగిపోయాయి. వరద ప్రవాహాన్ని తలపించే విధంగా రోడ్లపైకి నీరు రావడంతో ప్రజలంతా ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. మోకాలులోతు నీటితో ప్రవహరించడంతో ఇంటి ముందు పార్కు చేసి నిలిపిన కార్లతో పాటు ద్విచక్రవాహనాలన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం రావడంతో ఎక్కడెక్కడి నుండో వాహనాలు నీటి ప్రవాహంలో కొట్టుకుని రావడం కనిపించింది. విషయం తెలుసుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ వివిధ శాఖలకు చెందిన అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి లోతట్టు ప్రాంతాలలో ముందుగా పర్యటించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.



బర్కత్‌పుర బిజెపి కార్యాలయంలో బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# అధికారులు పట్టించుకోరా..?

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు



నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ షెడ్లు

కొంపల్లి, ఏప్రిల్29 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని దూలపల్లి అయ్యప్ప కాలనీకి ఎదురుగా ఉన్న స్టీల్ సిటీలో నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా అక్రమంగా భారీ షెడ్లు నిర్మిస్తున్నారు కొందరు అక్రమార్కులు. గ్రేటర్ హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న కొంపల్లి మున్సిపాలిటీలో యధేచ్ఛగా అక్రమ షెడ్లు నిర్మిస్తున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల పరోక్ష సహకారంతో భారీ షెడ్ల నిర్మాణం జరుగుతోందనే విమర్శలు స్థానికుల్లో వెల్లువెత్తుతున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారం లేకుంటే అనుమతులు లేకుండా నిబంధనలు ఉల్లంఘించి భారీ షెడ్ల నిర్మాణం చేసే ధైర్యం షెడ్ల యజమానులకు ఎక్కడిదని? అధికార పార్టీ అండదండలు ఉంటే ఎలాంటి అక్రమాలకైనా పాల్పడతారా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భారీ షెడ్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## 10 లక్షలతో మంచినీటి పైప్‌లైన్ పనుల శంకుస్థాపన



మంచినీటి పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పోరేటర్

హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: అంబర్‌పేట డివిజన్‌లోని పటేల్‌నగర్‌లోని బిలాల్ మజీద్ లైన్‌లో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న మంచినీటి పైప్‌లైన్ పనులకు స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట కార్పోరేటర్ ఇ.విజయ్‌కుమార్‌గౌడ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పోరేటర్ నరేంద్రనగర్, అన్నపూర్ణనగర్, బిలాల్ మజీద్‌లైన్‌లో పాదయాత్ర నిర్వహించారు. నరేంద్రనగర్‌లో నిర్మిస్తున్న కమ్యూనిటిహాల్ షెడ్ నిర్మాణం పని చివరిదశకు వచ్చిందని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కారిస్తానని, షెడ్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే అంబర్‌పేట డివిజన్‌లో ఎంసిహెచ్ కాలనీలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జనాభకు అనుగుణంగా ఉన్న డ్రైనేజీ లైన్‌తో ఇప్పటి వరకు ప్రజలు ఆనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని నూతన డ్రైనేజీ లైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మధు, రమేష్, దుర్గ, రాజేష్, బిఆర్ఎస్ నాయకులుసిద్ధార్థ ముదిరాజ్, జాఫర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలి



కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

హైదరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఎన్‌హెచ్ఎం పథకం కింద పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది వేతనాలను తక్షణమే పెంచాలని డిమాండ్ చేస్తూ ఆనేక మంది ఉద్యోగులు శనివారం కోఠిలోని ఎన్‌హెచ్ఎం కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. శనివారం ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా మాట్లాడుతూ 2018లో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జివో నెంబరు 510 విడుదల సందర్భంగా కొంతమందికి మాత్రమే పైస్థాయి వారికి వేతనాలు పెరిగాయని, కింది స్థాయి ఉద్యోగులకు వేతనాలు పెంచకుండా ప్రభుత్వం విస్మరించిందని ఆరోపిం చారు. అలాగే ప్రభుత్వం తక్షణమే జివో నెంబరు 60 ప్రకారంగా కూడా బస్తీ దవాఖానాలలో పనిచేస్తున్న సపో ర్టింగ్ స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో యూనియన్ నాయకులు రమా, రాజేష్‌ఖన్నా, ఆలీ, మురళీ కృష్ణ, బాలసుబ్రహ్మణ్యం, సుజాత, రాములమ్మ పాల్గొన్నారు.

## ఆరోగ్య సంరక్షణకు డిఎన్ఏ ఆధారిత సేవలు

హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త: ప్రతి వ్యక్తి తన డిఎన్ఏ ఆధారంగా వారి వారి వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణకు సంబంధించి నిర్ణయాలను పూర్తి అవగాహనతో తీసుకునే వీలైన అవకాశాన్ని కల్పించడమే తమ లక్ష్యమని మ్యాప్ మై జీనోమ్ సిఈఓ అను ఆచార్య అన్నారు. ఈమేరకు నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో చర్మ,కేశ సంరక్షణకు బ్యూటీ మ్యాప్ పేరుతో ప్రత్యేక డిఎన్ఏ ఆధారిత పరీక్షను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. ఈపరీక్షలో వ్యక్తి డిఎన్ఏను పూర్తిస్థాయిలో నిశితంగా విశ్లేషించి వారివారి జన్యు నిర్మాణాన్ని ఆధారంగా చేసుకుని సంరక్షణకు సంబంధించిన సూచనలు అందించబడతాయన్నారు. ఈపరీక్షలో ముఖ్యంగా 40కిపైగా అంశాలు అనగా మెటిమలు, జుట్టురాలిపోవడం, సూర్యుని వేడి కారణంగా చర్మం పాడుకావడం, పొడిబారి పోవడం, నిద్రపోయే అలవాటు ,విటమిన్ యొక్క స్థాయిలు లాంటి వాటిని పరిశీలించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## జనాభా దామాషా ప్రకారం బిసిల బడ్జెట్ కేటాయించాలి

ఒబిసి జన్ మోర్చా అధ్యక్షులు విజయ్ చందర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌చందర్, వినయ్, ముఖేష్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: బిసిల జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయింపులు జరగాలని ఓబిసి జన్‌మోర్చా అధ్యక్షులు ఎ.విజయ్ చందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసి సమాజం అభివృద్ధే ధ్యేయంగా ఒబిసి మోర్చా ఆవిర్భవించిందన్నారు. అభివృద్ధి అనేది వ్యక్తుల ఆధారితం కాకుండా సమాజం అభివృద్ధి చెందాలనేది తమ ఆశయం అన్నారు. 1979లో పార్లమెంట్‌లో మూడు సబ్‌ప్లాన్లు పెట్టడం జరిగిందని ఒకటి ఎస్సీసబ్‌ప్లాన్, ట్రైబల్ సబ్‌ప్లాన్ ,మూడవది బిసిసబ్‌ప్లాన్ అన్నారు. అయితే బిసిసబ్‌ప్లాన్‌ను ఎక్కడా అమలు చేయలేదం లేదని మండిపడ్డారు. దేశంలోని బిసిలందరూ ఐక్యమై డిమాండ్ల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వినయ్‌మిత్రా యాదవ్, వైస్ ప్రెసిడెంట్ భూరుగుల ముఖేష్‌గౌడ్, జనరల్ సెక్రటరీ అశోక్‌గౌడ్, జాయింట్ సెక్రటరీ నీలి వెంకటరాములు ముదిరాజ్, జాల రాఘవేందర్‌గౌడ్, ట్రెజరర్ ఉదయ్ మున్నూరు, సభ్యులు బాలరాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## 30 శాతం పిఆర్‌సిని వెంటనే విడుదల చేయాలి

సైఫాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: రాష్ట్రంలోని మైనార్టి పాఠశాలలు, కాలేజీల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతులో పనిచేస్తున్న 4 వేల మంది ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పెంచిన 30 శాతం పిఆర్‌సిని వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ డిమాండ్ చేశారు. శనివారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో జరిగిన ఉద్యోగుల సదస్సులో ఆయన మాట్లాడారు. గత 8 సంత్సరాల నుంచి ఈ ఉద్యోగులు ఏజెన్సీ ద్వారా అతి తక్కువ వేతనంతో పని చేస్తున్నారని ప్రభుత్వం వీరిని పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటి గార్డు, హౌస్‌కీపింగ్, కుకింగ్, ఎలక్ట్రిషన్, వార్డెన్, డిఇవో, అటెండర్ తదితర పోస్టులలో వీరు 500 నుంచి 18000లోపు కేటగిరిలలో పనిచేస్తున్నారని, సమయానికి వేతనాలు రావని, రోజుకు 12 గంటలు పనిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. గడిచిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం పిఆర్‌సిని ప్రకటించిందని, కాని అందరికి దక్కడం లేదని కేవలం కొద్ది మందికి మాత్రమే వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం 26 వేలుగా చెల్లించాలని, ఇతర అలవెన్సులు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, నజీర్, మహమ్మద్ గౌస్, షబానా, రజియా, శ్యామల, మంగ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన జాతీయ విద్యా చలన చిత్ర ఉత్సవాలు

తార్నాక, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఓ.యూలో మూడు రోజుల పాటు నిర్వహించిన 24వ జాతీయ విద్యా చలన చిత్ర ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిసాయి. కన్సార్షియం ఫర్ ఎడ్యూకేషనల్ కమ్యూనికేషన్, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో ఆయా విభాగాల్లో విజేతలైన డాక్యుమెంటరీ డైరెక్టర్లు, ప్రొడ్యూసర్లు, సాంకేతిక నిపుణులకు ట్రోఫీలను అందజేశారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడుతూ ఇలాంటి విద్యా చలన చిత్రాలు ఉద్యార్థులకు ఎంతో మేలు చేస్తాయన్నారు. భవిష్యతులో విద్యాసంభంద కార్యక్రమాలను ఓ.యూకు కేటాయించాలని కోరారు. సిఈసీ డైరెక్టర్ డా. నడ్డా సినిమాను తిలకించిన అనంతరం మాట్లాడుతూ ఇంట్లో అమ్మ చేసే పని మీద డాక్యూమెంటరీలు రావాలని యువ డైరుక్టరు, విద్యార్థులకు పిలిపు నిచ్చారు. ప్రాథమిక విద్య నుంచి డిజిటల్ విద్య రావలసిన అవసరం ఉందన్నారు. ఇలాంటి సినిమాలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఒ వరం అన్నారు. గౌరవ అతిథులుగా యూజీసీ వ్యవహారాల డీన్ ప్రొ.జి.మల్లేశం హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్సీ డైరెక్టర్ ప్రొ.మృణాళినితో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలుగు విశ్వవిద్యాలయంలో కళాత్మకంగా ఎన్టీఆర్ చిత్రకళా ప్రదర్శన



ఎన్టీఆర్ చిత్రకళాప్రదర్శనను తిలకిస్తున్న కిషన్‌రావు, రమేష్, సౌమ్య

నాంపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు, నిర్మాణ రూపశిల్పి, సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు డా. నందమూరి తారక రామారావు శతజయంతి ఉత్సవాలు గత నాలుగు రోజులుగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న తెలుగు విశ్వవిద్యాలయంలో వైభవోపేతంగా జరుగుతున్న విషయం మా పాఠకులకు విదితమే. ఈ ఉత్సవాల ఆఖరిరోజు శనివారం విశ్వవిద్యాలయ చిత్రం శిల్పకళలశాఖ, డిజైన్ కోర్సుల విద్యార్థులచే డా. ఎన్.టి.రామారావు చిత్రకళాప్రదర్శన విశ్వవిద్యాలయంలోని ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు ఆచార్య టి.కిషన్‌రావు, రిజిస్ట్రార్ బి.రమేష్, ఉత్సవాల కోఆర్డినేటర్ ఆచార్య కె.సుధీర్‌కుమార్, శిల్పకళలశాఖాధిపతి శ్రీనివాసాచారి, ప్రముఖ చిత్రకారిణి సౌమ్య, మహేష్, సురేష్, వెంకట్ తదితరులతో కలిసి రిబ్బన్ కట్‌చేసి ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించి ప్రసంగిస్తూ తెలుగు విశ్వవిద్యాలయంలోని శిల్పం చిత్రలేఖనశాఖ విద్యార్థుల ఆర్ట్ ఎగ్జిబిషన్ సంవత్సరం మొత్తం ఆర్ట్ గ్యాలరీలో కొనసాగిస్తామని, ఔత్సాహిక విద్యార్థులు తమ చిత్రకళాఖండాలను ప్రదర్శించుకోవడానికి గ్యాలరీని ప్రయోగశాలగా వినియోగించుకోవచ్చునని సూచిస్తూ అందుకు తగినట్లు సరైన ఏర్పాట్లను చేయాల్సిందిగా శాఖాధిపతిని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రకళాప్రదర్శనలోని అన్ని చిత్రాలను ఆయన నిశితంగా ఎంతో ఆసక్తితో తిలకించి చిత్రకళాకారులను అభినందించారు.

## అభివృద్ధిలో సతన్‌నగర్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త : అభివృద్ధిలో సనత్‌నగర్‌ను ఆదర్శవంత నియోజకవర్గంగా తీర్చిదిద్దేలా ఎంతో కృషి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. శనివారం సతన్‌గనర్‌లోని ఎస్ఆర్‌టిలో సంకేత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థానికంగా ఉన్న పలు సమస్యకలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవ్సరాలలో జరగని అనేక అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన 8సంవత్సరాలలో జరిగాయని చెప్పారు. నగరంలో ఎక్కడేలని విధంగా అత్యధికంగా 54పార్కులు ఒక్క సనత్‌నగర్ డివిజన్‌లోనే ఉన్నాయని అన్నారు. నెల రోజుల్లోగా పార్కులకు నెంబరింగ్ బోర్డులను అమర్చాలని మంత్రి అధికారులకు సూచించారు. ఎస్ఆర్‌టిలోని అన్ని రోడ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మన బస్తీ మన బడి కార్యక్రమం క్రింద సనత్‌నగర్ డివిజన్‌లో 7 ప్రభుత్వ పాఠశాలలను కార్పోరేటర్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడమే కాకుండా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించే విధంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, సంకేత్ సంస్థ నిర్వహకులు మురళి, డిసి మోమన్‌రెడ్డి, ఈఈ ఇందిర, టౌన్‌ప్లానింగ్ ఏసిపి రమేష్, ఎఎంఒహెచ్ భార్గవ్, వాటర్‌వర్క్స్ జిఎం హరిశంకర్, సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ ముత్తు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలి : ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య

చార్మినార్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : రౌడీషీటర్లు సత్ ప్రవర్తనతో మెలగాలని కాలాపత్తర్ ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య తెలిపారు. కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం ఆయన పాతబస్తీలోని పలు ప్రాంతాలకు చెందిన 27 మంది రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య మాట్లాడుతూ రౌడీ షీటర్లు గొడవలకు దిగిన, ఎటువంటి నేరాలకు పాల్పడిన చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.సత్ ప్రవర్తనతో మెలిగిన 9 రౌడీ షీటర్ల కేసులను పోలీస్ ఉన్నతాధికారులకు నివేదించి క్లోజ్ చేయటం జరిగిందని,ఒక రౌడీ షీటర్‌పై పీడీ యాక్టు పెట్టడం జరిగిందని ఆయన తెలిపారు.రౌడీ షీటర్లలో మార్పు రావాలనే ఉద్దేశ్యంతోనే కౌన్సిలింగ్ ఇస్తున్నామని ఆయన తెలియజేశారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించిన, ప్రజలను భయాందోళనకు గురి చేసినా రౌడీ షీటర్లపై పీడీ యాక్టు పెట్టడానికి వెనుకాడమని సిఐ బుచ్చయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలాపత్తర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.పాతబస్తీలో అత్యంత కీలకమైన కాలాపత్తర్ పోలీస్ స్టేషన్‌లో 70 మంది రౌడీ షీటర్లు ఉన్నారు.



## వర్షం గాలికి వంగిన చెట్లను కట్ చేసిన జిహెచ్ఎంసీ సిబ్బంది

మెట్టుగూడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: శనివారం కురిసిన భారీ వర్షం, గాలికి నేలకొరిగిన తార్నాక విజయపురి కాలనీలో జిహెచ్ఎంసీ సిబ్బంది భారీ మిషన్ ద్వార తొలగించారు. స్థానిక టీఆర్ఎస్ నాయకులు తెలంగాణ పెద్దన్న రాజేష్ గౌడ్ ఈ సమస్యను డిప్యూటీ స్పీకర్ పద్మారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాలమేరకు జిహెచ్ఎంసీ సిబ్బంది వంగి ప్రమాదకరంగా మారిని చెట్లను తొలగించారు.

## శృతిలయాత్మకం నేత్రపర్వం దీక్షితుల కూచిపూడి నృత్యం

నాంపల్లి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : భారతదేశంలో అనేక శాస్త్రీయ నృత్యరీతులున్నా ఆంధ్రదేశానికి చెందిన భారతీయనాట్యం కూచిపూడిలో నృత్యమేకాదు సాహిత్యంతో కూడుకున్న కీర్తనలకు హావభావాలు జోడించి చక్కని ఆహార్యంతో, నృత్యకళకే జీవంపోసేది కూచిపూడి కళాప్రదర్శనని విన్నవిస్తూ ప్రఖ్యాత కూచిపూడి నృత్యకళాకారుడు ఎస్. కె.వి.పి. దీక్షితులు తన సోలో కూచిపూడి నృత్యాన్ని శృతిల యాత్మకం ప్రదర్శించి ఆహుతులైన అశేష కళాప్రియులకు, ఔత్సాహికులకు నేత్రపర్వం కావించాడు.

## కవన కిరణాల అయిదు అద్భుత పుస్తకాల ఆవిష్కరణ



కవన కిరణాల అయిదు పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సిధారెడ్డి, దేవదాసు, దేవానంద్, శివమంచాల తదితర అతిథులు

రవీంద్రభారతి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో కవన కిరాణాలు తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో సమాఖ్య 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శివ మంచాల సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డా. నందిని సిధారెడ్డి, బైసదేవదాసు, దేవానంద్ నాగెల్ల విశిష్ట అతిథులు పోతురాజారాం, మౌనశ్రీమల్లిక్, ప్రకాష్, పి.పద్మావతి, జి.జి.రావు తదితరులతో కలిసి కవన కిరణాలు మూడవ కవితా సంకలం, అమృతధారలు, దివిటీలు, జీనే కా నామ్ జిందగి, వనజ శతకం మొత్తం అయిదు పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిధారెడ్డి మంచి కవిత్వానికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని, కవన కిరణాల సంస్థ అధ్యక్షుడు శివ పలువురు కవులను కలుపుకొని కవితా సంకలనాన్ని తీసుకురావడం శ్లాఘనీయ మన్నారు. బైస దేవదాసు మాట్లాడుతూ కవన కిరణాలు సంస్థ మరిన్ని ఆసక్తికర మైన పుస్తకాలు తేవాలని కోరుతూ సంస్థ చేస్తున్న సాహిత్య సేవలను కొనియాడారు.

## దళిత క్రైస్తవులు హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలి

గద్దపాటి విజయ్



దళిత క్రైస్తవుల సదసస్సులో ప్రసంగిస్తున్న గద్దపాటి విజయరాజు

అడ్డగుట్ట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: దళిత క్రైస్తవులు తమ హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలని, మతం మారినంత మాత్రనా బిసీ కులాల్లో గుర్తించడం సరైంది కాదని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు గద్దపాటి విజయరాజు పిలుపునిచ్చారు. శనివారం సికింద్రాబాద్‌లోని మీలినియం మేథడిస్ట్ చర్చి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. దళితులు క్రిస్టియన్‌లోకి కన్వర్ట్ అయినంత మాత్రానా బిసీలుగా గుర్తించడం సరైందికాదన్నారు. సామాజిక,ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుక బడి ఉన్న దళిత క్రిస్టియన్లను ఎస్సీలలోనే ఉండే విధంగా చట్టం మార్చాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ప్రదీప్ నారబోయిన, ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ప్రతినిధులు ఓరుగంటి ఆనంద్, రాజు అలెక్స్,రాజీవ్ సాగర్, రాయుడీన్ రోచ్, అప్పికట్ల జాకబ్, విల్సన్, డేవిడ్ కడారీ, కరునశ్రీ, జయశ్రీ, విజయ సాగల, వనిత పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు

హైదరాబాద్, ఏప్రిల్ 29, ప్రభాతవార్త: గతంలో వైద్యం విషయంలో ఎటువంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా ముంబై, చెన్నై, ఢిల్లీలాంటి నగరాలకు వెళ్ళేవాళ్లమని కానీ ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో ప్రపంచ స్థాయి వైద్యం అందుతుండటంతో పాటు ఆధునిక సాంకేతికత కూడా వినియోగిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో తమ ఆసామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో హాస్పిటల్ టూర్ పేరుతో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు మెడికేర్ వైద్యులు తెలిపారు. ఈమేరకు శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఈవో దినేష్‌గౌడ్, డైరెక్టర్ సురేష్‌లు మాట్లాడుతూ దేశంలోనే దిబెస్ట్ హెల్త్‌సిటీగా హైదరాబాద్ మారబోతుంద న్నారు. తాము చేపట్టబోయే టూర్‌లో భాగంగా తొలుత ఎంపిక చేసిన గ్రామాల్లో తమ ఆస్పత్రి నుంచి వైద్యులతోపాటు సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రత్యేక వైద్యశిభిరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. వైద్యం ఉచితంగా అందించడంతో వారికి అవసరమైన మందులు సైతం ఇస్తామని వెల్లడించారు. అదేవిధంగా వైద్యం విషయంలో తాము ఉపయోగించే ఆధునాతన పరికరాలు వైద్యానికి సంబంధించిన పలు విషాలను ఉచితంగా తెలుసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు కృష్ణచైతన్య, ఆనంద్, రాజగోపాల్, చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి : శ్రీకాంత్ సిన్హా



అవార్డులు అందుకున్న వారితో శ్రీకాంత్ సిన్హా, కిరణ్ పెండ్యాల సత్యనారాయణ

హైదరాబాద్, ఏప్రిల్ 29,ప్రభాతవార్త: పరిశ్రమలకు అనుగుణంగా కళాశాలల్లో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ద్వారా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని టాస్క్ సిఈఓ శ్రీకాంత్ సిన్హా తెలిపారు. ఈమేరకు నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో తెలంగాణ ఫెసిలీటిస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ (టిఎఫ్ఎంసి) ఆధ్వర్యంలో నేషనల్ ఫెసిలిటీస్ మేనేజర్స్ సమ్మిట్ 2023ను నిర్వహించారు. ఈసందర్భం గా పరిశుభ్రత, పచ్చదనం నిర్వాహణలో ఉత్తమంగా నిలిచిన ఐటిపార్కులు, గేటెడ్ కమ్యూనిటీలకు గ్రీన్ అవార్డులను అందజేశారు. ఈసందర్భంగా శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ టాస్క్ ద్వారా ఇప్పటివరకు 7.50లక్షల మందికి శిక్షణ పూర్తి చేసినట్లు తెలిపారు. 1.2లక్షల ఇంజనీరింగ్ సీట్లు ఉంటే ఈఏడాది 62 వేలు పూర్తిగా, 94శాతం కంప్యూటర్ సంబం ధిత కోర్సుల్లోనే చేరినట్లు చెప్పారు. మిగతా విభాగాల్లో మానవ వనరుల కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ పెండ్యా ల, హైసియా అధ్యక్షురాలు మనీషా సబూ, టిఎఫ్ఎంసి అధ్యక్షులు సత్యనారాయణ మథాల, గౌరల్ ఠాకూర్‌లు పాల్గొన్నారు.

## కంటోన్మెంట్ ప్రజలకు సౌకర్యాలు మెరుగుపర్చాలి

కంటోన్మెంట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: వివిధ సమస్యల పరిష్కా రం, ఫిర్యాదుల కోసం వచ్చే సందర్శకులకు కంటోన్మెంట్ బోర్డు కార్యాల యంలో తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డి.వి.దేవేందర్ (దేవుడు),కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌కు, బోర్డు మెంబర్ రామక్రిష్ణలకు వినతిపత్రం అందజేశారు. వివిధ అంశాలపై కంటోన్మెంట్ బోర్డు కార్యాలయానికి వచ్చే ప్రజలకు మంచినీరు, ఫర్నీచర్ వంటి సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిఈఓ దృష్టికి తెచ్చారు.

## కార్పొరేటర్‌గా ఉండి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడం సిగ్గుచేటు: బిఆర్ఎస్



సమావేశ ంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

సైదాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: గతంలో కర్మన్‌ఘాట్ ప్రజలకు త్రాగు నీటిని అందించిన సర్వే నెం.24, 25లోని బావి స్థలాన్ని తన కుటుంబ సభ్యుల పేరుతో చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి కబ్జా చేశారని బిఆర్ఎస్ నాయకులు ముదుపు రాజిరెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, సుర్వి పెంటయ్య గౌడ్‌లు ఆరోపించారు. కర్మన్‌ఘాట్ ప్రజల త్రాగునీటి అవసరాల కోసం బావి స్థల యజమాని వంగ ధర్మారెడ్డికి 1983లో గ్రామ పంచాయితీ నిధుల నుంచి రూ.79 వేలు చెల్లించి 452 గజాల బావి స్థలాన్ని న్యాయబద్ధంగా గ్రామపంచాయితి కొనుగోలు చేయడం జరిగిందని, అప్పటి ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ పేరుమీద ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి చెందిన ఆ స్థలాన్ని ఇటీవల కాలంలో కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యుల పేరుతో కబ్జా చేయడం జరిగిందని వారు ఆరోపించారు. స్థానికుల కోరిక మేరకు వంగ ధర్మారెడ్డి ఉదారతతో గ్రామపంచాయితీకి అమ్మిన స్థలాన్ని ప్రజాప్రతినిధిగా ఉన్న వ్యక్తి తిరిగి ఆక్రమించుకోవడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేసే కార్పొరేటర్ వంగ మధు ముందుగా తమ కుటుంబ సభ్యుల పేరుతో కబ్జా చేసిన ప్రభుత్వ స్థలాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలని వారు డిమాండ్ చేశారు. ఆ స్థలంలో మిని ఫంక్షన్‌హాల్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల్లో ఏదో ఒకటి నిర్మించాలని, కార్పొరేటర్ ఆ స్థలాన్ని తిరిగిప్రభుత్వానికి అప్పగిస్తే అక్కడ ఎమ్మెల్యే సహకారంతో ప్రభుత్వ భవనాల నిర్మాణం చేపట్టడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర్, మల్లేష్‌గౌడ్, గౌర శ్రీనివాస్, జగదీష్ గౌడ్, శివ, చీర తిరుమలేష్, చందు, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణ మహోత్సవం

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : కొత్తపేట మారుతి నగర్ లోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి దేవాలయంలో నవమి సందర్భంగా శ్రీ సీతా రామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవాలయం ప్రధానఅర్చకుడు సుధీర్‌శర్మ పౌరోహిత్యంలో సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాలయం ప్రతినిధులు మురళీధర్ రావు, రాయుడు, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## నేడు డాక్టర్స్ కాలనీలో ఉచిత ఆరోగ్య శిబిరం

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీలో ఆదివారం ఉచిత ఆరోగ్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు తెలిపారు. ఉచిత ఆరోగ్య శిబిరానికి సంబంధించి శనివారం కరపత్రాలను కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకు కాలనీ సంక్షేమ సంఘం భవనంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జీగిని రామమూర్తి, ఉపాధ్యక్షులు వన్నడి శ్రీనివాస్, దండెం జనార్ధనరెడ్డి, ఈసి.మెంబర్ వి. దయాకర్. ప్రాణహిత హాస్పిటల్ సీనియర్ మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్ జీ. రాజేశ్వర, మెడికల్ అడ్మినిస్ట్రేటర్ జి. అజిత్ పాల్గొన్నారు.

## విజయవంతంగా ఎండోవాస్కులర్ చికిత్స చేసిన కామినేని వైద్యులు



చికిత్స వివరాలను తెలుపుతున్న వైద్యులు రాజీవ్ తదితరులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: పొత్తి కడుపు నుండి తొడ నరాల వరకు రక్తనాణాలు ఉబ్బడంతో నూతన టెక్నాలజీతో పాటు మాగ్నటికి వైర్ల విధానంతో 73 సంవత్సరాల వృద్ధ రోగిపై హై రిస్క్ ఎండోవాస్కులర్ ప్రొసీజర్‌ను ఎల్‌బినగర్ కామినేని వైద్యులు విజయవంతంగా పూర్తిచేసి రోగి పూర్తిగా కోలుకునేలా చేశారు. ఈ సందర్బంగా ఎల్‌బినగర్ లోని కామినేని ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ కార్డియో థెరాపిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ రాజీవ్‌దేశ్‌ముఖ్ మాట్లాడుతూ సామాన్యంగా రోగిలో రక్తనాణాలు మూసుకుపోయి ఆపరేషన్లు చేస్తున్న క్రమంలో మరణాలశాతం ఎక్కువగా ఉంటుంది. కానీ నూతన సాంకేతికను ఉపయోగించడంతో పాటు మాగ్నటిక్ వైర్లతో రోగికి 3 స్టంట్లు వేశామన్నారు. ఈ నూతన విధానంతో ఈ తరహా ఎండోవాస్కులర్ ప్రొసీజర్‌ను ఉపయోగించింది తెలుగు రాష్ట్రాలలో తామేనని వారు ఈ సందర్బంగా తెలిపారు. ఈ నూతన విధానాన్ని ప్రోత్సహించి తమకు అన్ని విధాల సహకరించిన కామినేని ఆసుపత్రి యాజమాన్యానికి వారు ఈ సందర్బంగా ధన్యవాదాలు తెలిపారు. కాగా అబ్దుల్లాపూర్‌మెట్‌మండలం ఇనాంగూడ గ్రామానికి చెందిన పొన్నయ్యకు ఈ చికిత్స చేసి విజయవంతం చేశారు. ఈ సమావేశంలో వైద్యులు విశాల్ ఖాంటే , రవికాంత్, సాగర్ భూయార్, సురేష్‌కుమార్, స్రుతి పాల్గొన్నారు.

## కాలనీలో కార్పొరేటర్ పర్యటన

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : కొత్తపేట డివిజన్ శివగంగ కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్‌డబ్ల్యుఏ ఇంట్రాక్షన్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయకోటి పవన్‌కుమార్ హాజరై కాలనీవాసులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు, డ్రైనేజ్ శానిటైజేషన్, దోమలు, కుక్కలు, మంచినీరు తదితర సమస్యలను గురించి కాలనీవాసులతో చర్చించారు. ఆయా సమస్యలను విడుదలవారీగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ సూచించారు. అనంతరం ఏఈ మాత్రు నాయక్, ఎస్సై మదుతో కలిసి కాలనీలో పర్యటించి రోడ్డు, డ్రైనేజ్, పెట్రోలింగ్ సమస్యలు పరిశీలించారు. అనంతరం భరత్ నగర్ ఫేస్ 2లో ట్రంక్ లైన్ నాళాలలో పేరుకుపోయిన మట్టిని శుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు అంబాల మల్లేష్, సుబ్బారావు, వాటర్‌వర్క్స్ అధికారులు అరిఫ్, లక్ష్మయ్య, విజయ భారతి, అఖిల్, సంగీత పాల్గొన్నారు.

## కర్ణాటక రాష్ట్ర సివి రామన్ నియోజక వర్గ అబ్జర్వర్‌గా పత్తి కుమార్

కుషాయిగూడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో భాగంగా సివి రామన్‌నగర్ నియోజకవర్గ ఎన్నికల బాధ్యతలను పత్తి కుమార్‌కు ఇచ్చిన ఏఐసీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున్ కర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ దళిత విభాగం అధ్యక్షులు రాజేష్ లిలోతియా, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర దళిత విభాగం అధ్యక్షులు నగరి గారి ప్రీతంలకు ఆయన ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భగా పత్తి కుమార్ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ బాధ్యతలు అప్పగిచ్చినందుకు సివి రామన్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపుకు కృషి చేసి కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి కష్టపడతామని తెలిపారు.

## నిరు పేద వ్యక్తి చికిత్సకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం : మంత్రి సబిత



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: తీవ్ర అనారోగ్యానికి గురైన బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 32వ డివిజన్‌కు చెందిన పేద వ్యక్తి వైద్య చికిత్సకు మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందించారు. బడంగ్‌పేట్ నివాసి అయిన పి.పెంటయ్య తీవ్ర అనారోగ్య కారణాల వల్ల ఆసుపత్రిలో చేరగా ఆర్థిక స్థోమత లేని కుటుంబ సభ్యులు స్థానిక కార్పొరేషన్ బిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పుట్టగళ్ళ సంతోష్‌ను ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్ళగా స్పందించిన ఆమె సిఎం రిలీఫ్ ఫండ్ నుండి రూ.60 వేలు మంజూరు చేయించి శనివారం చెక్కును అందజేశారు. ఈ మేరకు పెంటయ్య, ఆయన కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి లక్ష విరాళం

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: జిల్లెలగూడలోని పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, స్థానిక గౌడ సంఘం నాయకుడు కుంటల వల్లభ్‌రాజ్ గౌడ్ రూ.1,00,116లను విరాళంగా అందజేశారు. ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాముడినవుతానని గతంలో ప్రకటించిన ఆయన విరాళాన్ని ప్రకటించి ఆలయ ఛైర్మన్ కొత్త మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో బొక్క యాదిరెడ్డి, కొత్త జనార్ధన్‌రెడ్డి, కానాల కేమాద్రి, సిద్దాల జగదీశ్‌లు పాల్గొన్నారు.

## రేపటి నుండి జిల్లెలగూడ శ్రీవారి బ్రహ్మోత్సవాలు

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: ఉత్తర ద్వారం ఉన్న అరుదైన ప్రాచీన దేవాలయంగా గుర్తింపు పొందిన జిల్లెలగూడలోని శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు మే 1వ తేదీ నుండి ప్రారంభంకానున్నాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో మే 7వ తేదీవరకు శ్రీవారి బ్రహోత్సవాలను నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మే మూడవ తేదీన స్వామివారి తిరు కళ్యాణోత్సవం, 5వ తేదీన శ్రీవారి రథోత్సవం, 7వ తేదీన శేష వాహన సేవ, రుత్వికుల సన్మానంతో ఉత్సవాలు ముగుస్తాయి. కాగా బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకున్నారు. అయితే బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాలకు భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఇఓ తెలిపారు.

## ఇంట్రాక్షన్ కార్యక్రమానికి విశేష స్పందన : కార్పొరేటర్ భాగ్యలక్ష్మి



కాలనీవాసులతో సమావేశాన్ని నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి నిర్వహించిన ఇంటెన్సివ్ శానిటేష న్, ఆర్‌డబ్ల్యూఎ ఇంటాక్షన్ కార్యక్రమానికి విశేషస్పందన లభిస్తుందని మూసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. డివిజన్‌లోని కృష్ణతులసినగర్, రామాలయం బస్తీ కమిటి ఇంట్రాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆమె అడిగి తెలుసుకున్నారు. కృష్ణతులసినగర్ లో రోడ్డును 4 నెలలనుండి తవ్వి వదిలేసారని, వాటర్ వర్క్స్ వారు పైప్ లైన్ వేయడంతో రోడ్డు అస్తవ్యస్తంగా తయారైందని ఇప్పటివరకు కనెక్షన్ ఇవ్వలేదని, రోడ్డు తవ్వి మధ్యలో పనులు ఆపివేసారని అధికారులు సరైన సమాధానం ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేసారు. రామాలయంనుండి ఆరోరా కాలేజ్ వరకు నూతన డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేసి రోడ్డు నిర్మించాలని, నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయాలని, చెట్లకొమ్మలు ట్రిమ్మింగ్ చేయాలని, ఇష్టమొచ్చినట్లు బార్‌వద్ద వాహనాలను పార్కు చేసి రోడ్డును బ్లాక్ చేస్తున్నారని తదితర అంశాల గురించి స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆమె స్పందించి స్థానికప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధితఅధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి బన్సిలాల్ కుమార్, అధికారులు చంద్రునాయక్, షకీల్, ఎస్ఐ శృతి, గున్నప్ప, జవాన్ రమేష్, గణేష్, శ్రీను, ఎఇ రాజు, సల్మాన్, స్థానికులు విశ్వనాథ్, సురేందర్, ప్రవీణ్, కష్ణరావు, రామరావు, కిరణ్, సదానంద్, సంతోష్, క్రాంతి, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు మన్‌కీ బాత్ కార్యక్రమం : సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : నేడు మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ కార్యక్రమం ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మలక్‌పేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సుమారు 350 భారీ తెరలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజన్ అధ్యక్షులు, అసెంబ్లీ కన్వీనర్లు బూత్ ఏరియాలలో మన్‌కిబాత్ కార్యక్రమాన్ని వీక్షించడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని కోరారు.

## మురికి నీటి కాలువ సమస్యను పరిష్కరిస్తాం : కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి



కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ రామలింగం, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

జవహర్‌నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 23వ డివిజన్ కార్పొరేటర్ ఎడ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలకు డివిజన్ పరిధిలోని నాళాలు పొంగి ఇళ్లల్లోకి వర్షపు నీరు ప్రవేశించాయి. దీంతో మున్సిపల్ కమిషనర్ రామలింగంతో కలిసి డివిజన్లో పర్యటించారు. నాలాల్లో పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొక్కలతో నిండిపోయిన మురికినీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలోనే మురికి నీటి నాళాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి నీరు సరిగా పోయే విధంగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 23 వ డివిజన్ అధ్యక్షుడు బాలా చారి, బాల్ రెడ్డి, మన్నె శేఖర్ బాబు, బస్తివాసులు పాల్గొన్నారు.

## మాధవనగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యేకు వినతి

సైదాబాద్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: చంపాపేట డివిజన్ మాధవనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, బిఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ సంక్షేమ స ంఘం వినతి మేరకు వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జోనల్ కమీషనర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హన మంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బెనర్జీ, కోదండరాంరెడ్డి, అనసూయ, గోపాల్‌ముదిరాజ్, సత్తయ్య, రామ్మోహన్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలి : కార్పొరేటర్ చింతల

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని నాగోల్‌డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రాక్ టౌన్ కాలని, రాక్ హీల్స్, బాలాజీ నగర్, లక్ష్మీ నగర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్‌లో సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించగా కార్పొరేటర్ చింతల అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని కాలనీలో పెండింగ్ లో ఉన్న సిసి రోడ్లు, డ్రైనేజీ, స్టీట్ లైట్స్, వాటర్ సమస్యలను, దోమల బెడద, కుక్కల సమస్యను తొందరగా పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ఏ ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు. అన్ని పనులను తొందరగా పూర్తి చేస్తానని కాలనీ వాసులకి హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదికారులు చంద్రశేఖర్ రెడ్డి, అర్చన, సిబ్బంది, విద్యుత్ అధికారులు, సిబ్బంది, వివిధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణలక్ష్మి పథకం నిరు పేదలకు ఆసరా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : కళ్యాణలక్ష్మి పథకం పేదలకు ఆర్థికంగా ఆసరాగా నిలుస్తుందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సరూర్‌నగర్, ఉప్పల్ మండలాలకు చెందిన 185 మంది లబ్దిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం పేద ప్రజలకు ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. తెలిపారు.అర్హులైన ప్రతిఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బడుగు, బలహీనవర్గాలకు ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయంతో ఎంతో మంది పేద కుటుంబాలకు పెండ్లిల భారం తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్‌గుప్తా, సరూర్‌నగర్ తహసిల్దార్ జయశ్రీ, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## డివిజన్లలో డ్రేనేజీ సమస్యలను పరిష్కరించాలి : కార్పొరేటర్లు

మల్కాజిగిరి, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ఆదేశాల మేరకు గౌతమ్‌నగర్ పరిధిలోని రామాంజనేయనగర్‌లో కార్పొరేటర్ మేకల సునీతరామూయాదవ్ అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులు శుక్రవారం కురిసిన వర్షానికి డ్రేనేజి ఓవర్ ఫ్లో అవుతుండడంతో నీరు రోడ్డు మీదికి వచ్చి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని డ్రేనేజి రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర ్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల రాముయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలో...** ఆనంద్‌భాగ్ డివిజన్ పరిధిలోనీ సెయింట్ ఆన్స్ స్కూల్, పివిఎన్ కాలని నుండి సత్యారాఘవేంద్రకాలని వరకు శుక్రవారం కురిసిన వర్షానికి జలమయమైనా నాలాను కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ అధికారులతో పరిశీలించి జిహెచ్ఎంసి సిబ్బందిచే చేపట్టిన నాలా క్లినింగ్ పనులను పరిశీలించారు. డ్రైనేజి ఓవర్ ఫ్లో అవుతుందని ఎప్పటికప్పుడు నాలాను శుభ్రం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్స్పెక్టర్ రజినీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, శ్రీశైలంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి ఎమ్మెల్యేల పైన చర్యలేవి : మల్‌రెడ్డి రామ్‌రెడ్డి



పాదయాత్ర నిర్వహిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : అవినీతి ఎమ్మెల్యేల చిట్టా నా దగ్గర ఉందని చెప్పిన అధికార పార్టీ ముఖ్యమంత్రి వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో తెలుపాలని ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మల్ రెడ్డి రాంరెడ్డి డిమాండ్ చేశారు. పేద దళితులకు దళిత బంధు పథకం ద్వారా ఉపాధి కల్పిస్తున్నామని వారి దగ్గర లంచాలు తీసుకుంటున్న ఎమ్మెల్యేలపై వారి అనుచరులపై చర్యలు తీసుకోకుండా గుడ్డి గుర్రాల పళ్ళు తోముతున్నాడా ఈ ముఖ్యమంత్రి అని ప్రశ్నించారు. శనివారం చైతన్యపురి డివిజన్ కమలానగర్ నుంచి గడ్డి అన్నారం వరకు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హాత్ సే హాత్ జోడో యాత్రలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాల భర్తీ చేయకుండా నిరుద్యోగుల పొట్టపై కొడుతున్న ముఖ్యమంత్రి ఇది చాలదు అన్నట్టు ఒక్క నోటిఫికేషన్ వేసి ఆ పరీక్షలు కూడా సక్రమంగా నిర్వహించలేని చేతకాని దద్దమ్మ ప్రభుత్వం అని విమర్శించారు. దళిత బంధు ఒక మోసమని, దళితుల కోసం కాదు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు,వారి అనుచరుల జేబులు నింపే బంధు అనే విషయాన్ని దళితులు గుర్తుంచుకోవాలన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనుచరులు విచ్చలవిడిగా చెరువులను కబ్జా చేసుకుంటున్నారని ఆరోపించారు.. ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి నేటి వరకు నియోజకవర్గానికి ఎన్ని ఎమ్మెల్యే నిధులు తీసుకువచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెండింగ్ ఛలాన్లు ఎత్తివేస్తామని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకి అండగా కాంగ్రెస్ పార్టీ జెండా ఉంటుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని పునరుద్ధరించి ఐదు లక్షల వరకు పెంచుతామని, గ్యాస్ సిలిండర్ ధర 500 రూపాయలు చేస్తామని, విద్యార్థులకి ఫీజు రీయింబర్స్మెంట్ సకాలంలో విడుదల చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, గోవర్ధన్, వేణు యాదవ్, సురేష్, శ్రీనివాస్, గాష్ పాషా, విజయ్, రాజ, శ్రీను, నాగరాజ్, శ్యామ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, శ్రీపాల్‌రెడ్డి, లింగాలకిషోర్ గౌడ్, నర్సింహ యాదవ్, సురేందర్‌రెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి, జానీ బాబా, రమేష్ నాయక్, యూసుఫ్, భాను, అరుణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే బలాల



ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న నక్క రాజేష్ తదితరులు

మలక్‌పేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : మలక్‌పేట నియోజక వర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని నియోజకవర్గ ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. అజంపుర డివిజన్ రాజనర్సింహ్మానగర్‌లో వవిధ శాఖల అధికారులతో కలిసి స్థానిక ప్రజలతో సమావేశాన్ని నిర్వహించారు. స్థానిక ప్రజల సమస్యలను ఎమ్మెల్యే బలాల అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పేర్కొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. రాజనర్సింహ్మానగర్‌లో జి ప్లస్ 1 కమ్యూనిటీ హాల్ మంజూరు చేయడం జరిగిందని, త్వరలో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. సిసిరోడ్డు, సివరేజ్ లైన్, వాటర్‌లైన్, ఎలక్ట్రికల్ కేబుల్ పనులను ఆయన ప్రారంభించారు. ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రాజనర్సింహ్మానగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడదంపట్ల స్థానిక సంక్షేమ సంఘం నాయకుడు నక్క రాజేష్ ఎమ్మెల్యే బలాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం నాయకుడు అబ్రార్, నక్క రాజేష్, ఎల్లేష్, చిగురు బాలరాజ్, హనుమంతు, అనిల్, నరేందర్, రమేష్‌తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెరాలసిస్ బాధితురాలికి బిఎల్ఆర్ ట్రస్ట్ అండ

కుషాయిగూడ, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమకారురాలు రత్నమాల పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుందని విషయం తెలుసుకున్న బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జైపాల్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి ఎల్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా, సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నట్లు, డివిజన్ పరిధిలోని ఎవరికి ఏ కష్టం వచ్చినా చారిటబుల్ ట్రస్టు ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దూసరి నవీన్‌గౌడ్, హరి, గోపాల్‌గౌడ్, మాల రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్లను అధునాతనంగా తీర్చిదిద్దడానికి కృషి : చైర్‌పర్సన్



సమావేశాన్ని నిర్వహిస్తున్న అనితానాయక్, దామోదర్ తదితరులు

మలక్‌పేట, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అధునాతనంగా తీర్చిదిద్దడానికి కృషి చేసున్నామని నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితా నాయక్ పేర్కొన్నారు. మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో చాదర్‌ఘాట్‌మాన్షన్ మార్కెట్ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి వ్యాపారస్తులతో కలిసి చైర్‌పర్సన్ అనితానాయక్, ఎస్‌జిఎస్ దామోదర్‌లు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో సిసి కెమెరాలను ఏర్పాటు ఏసుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు. ప్రతి దుకాణం, మార్కెట్ యార్డులలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. మార్కెట్‌లో దొంగతనాలు జుగకుండా పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ ఉపాధ్యక్షులు వంజరి వినోద్‌కుమార్, చేగూరి వెంకటరమణ, దుగ్గు జగదీష్, ప్రధాన కార్యదర్శి బట్కిరి విద్యానంద్, డైరెక్టర్లు లలిత, బట్కిరి విద్యానంద్, రాముయాదవ్, అభిషేకం, నరేష్, ఎజాస్, సల్మాన్‌ఖాన్, యాదగిరి, గ్రేడ్ 3 కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఎస్ఐలు గోపికిరణ్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

## హెల్పింగ్ హ్యాండ్స్ అధ్వర్యంలో నేడు కృపా కాంప్లెక్స్ వద్ద మెగా వైద్య శిబిరం..

నేరెడ్‌మెట్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : హెల్పింగ్ హ్యాండ్స్ అధ్వర్యంలో, బీజెపి ఓబిసి మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ సహకారంతో కృపా కాంప్లెక్స్ ఎల్.బి నగర్ కమ్యూనిటీ హాల్‌లో నేడు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి మధ్యప్రదేశ్ బీజెపి ఇన్‌చార్జి మురళీధర్ రావు వస్తున్నట్లు తెలిపారు.

## సమ్మర్ కోచింగ్ క్యాంపులో లార్డ్స్ విద్యార్థులు

సరూర్‌నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త: వేసవి నేపథ్యంలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో ఉప్పల్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో జిల్లెలగూడ లార్డ్స్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించిన ఈ క్యాంపులో విద్యార్థులకు పలు క్రీడల్లో శిక్షణనివ్వనున్నారు. కాగా లార్డ్స్ పాఠశాలకుచెందిన విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నట్లు విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ఛైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు.

## పేద విద్యార్థి చదువుకు ఆర్థిక సహాయం



విద్యార్థికి నగదు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ఎల్.బి.నగర్, ఏప్రిల్ 29 ప్రభాతవార్త : నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఉప్పల ఫౌండేషన్ ఆర్థికంగా చేయూతను అందిస్తుందని రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, ఉప్పల ఫౌండేషన్ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. బండ్లగూడ ఖాళీమందిర్ వాసి, తండ్రి లేని పేద విద్యార్థి ప్రసన్న కుమార్ ఎంబిబిఎస్ చదువు కోసం శనివారం ఉప్పల శ్రీనివాస్ గుప్తా రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం అవుతున్నారని వారికి తాము అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.